RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 10 మే 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:288

# హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దుదాం:రేవంత్‌రెడ్డి



మిగతా 2లో

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ (CURE) మొత్తంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి గారు పాల్గొన్నారు. ఆధునీకరణ, నగరీకరణతో సమీప భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించడానికి ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి సమావేశంలో సవివరంగా ఆవిష్కరించారు.

# ప్రధానమంత్రి కార్యక్రమాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించనున్న పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవం, హైదరాబాద్-పనాజీ ఎకానమిక్ కారిడార్‌లోని గుడెబల్లూర్-మహబూబ్‌నగర్ నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ పనులను హైదరాబాద్ హెచ్ఐసీసీ వేదికగా ప్రధానమంత్రి ఆదివారం వర్చువల్‌గా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలంటూ కేంద్ర ప్రభుత్వం తరఫున జాతీయ రహదారుల శాఖ రీజినల్ ఆఫీసర్ కృష్ణప్రసాద్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

## నిరసన దీక్షకు దిగిన వీహెచ్




హైదరాబాద్, మే 9, తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆమరణ నిరాహారదీక్షను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన దీక్షకు దిగారు. బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆయన దీక్షను ప్రారంభించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీల అభ్యున్నతి జరగాలంటే, ముందుగా వారి జనాభా ఎంత ఉందో స్పష్టంగా తెలియాలని వీహెచ్ వాదిస్తున్నారు. జనగణనలో బీసీ కులాలను కూడా లెక్కించడం ద్వారానే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన న్యాయం జరుగుతుందని చెబుతున్నారుమే 8వ తేదీ లోపు ఈ విషయంలో స్పష్టత ఇచ్చిన తర్వాతే ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు రావాలని వీహెచ్ గతంలోనే అల్టిమేటం ఇచ్చారు. ఈ లోపు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం, తాను రాసిన లేఖలకు జవాబు లేకపోవడంతో ఆయన ఈరోజు దీక్షను ప్రారంభించారు. కేవలం బీసీల హక్కుల కోసమే ఈ పోరాటమని ఆయన స్పష్టం చేశారు.

## బండి సంజయ్ కు బిగ్ షాక్ కొడుకుపై పోక్సో కేసు

హైదరాబాద్, మే 9, తెలంగాణ రాజకీయాల్లో మరో కలకలం. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక మైనర్ బాలికపై లైంగిక వేధింపులు, అత్యాచారం జరిగినట్టు సమాచారం అందడంతో పోలీసులు రంగంలోకి దిగారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం, బాధితురాలు మైనర్ కావడంతో ఫోక్సో చట్టం కింద నమోదు చేశారు. అందిన సమాచారం ప్రకారం, ఈ ఘటనలో బాధితురాలు కేవలం 17 సంవత్సరాల వయసు ఉన్న బాలిక. భగీరథ్ సదరు బాలికకు మద్యం తాగించి, తనపై అత్యాచారం చేసినట్టు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. మొయినాబాద్లోని ఒక ఫామ్ హౌజ్‌తోపాటు మరో రెండు ప్రాంతాల్లో జరిగినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడానికి వచ్చినప్పుడు పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నిన్న అర్ధరాత్రి సుమారు 6 గంటలపాటు పోలీస్ స్టేషన్ వేదికగా హైడ్రామా నడిచింది. నిందితుడు కేంద్రమంత్రి కుమారుడు కావడంతో పోలీసులు తీసుకోవడానికి మొద వెనుకడుగు వేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే బాధితుల ఒత్తిడి మేరకు పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. అయితే ఇదంతా హనీ ట్రాప్‌ను బండి భగీరథ్ కేసు నమోదు చేశారు. కరీంనగర్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ప్రకారం చాట్ల అన్వి అనే యువతి తనతో స్నేహం పేరుతో పరిచయం పెంచుకుందని, ఆ పరిచయంతో ఆమె తన కుటుంబ వేడుకలకు, గ్రూప్ మీటింగ్స్‌కు ఆహ్వానించేంది. కొన్ని పవిత్ర స్థలాలకు కూడా వెళ్లినట్టు సమాచారం. అయితే కొంత కాలం తర్వాత తన అసలు రంగును బయటపడిందని, చాట్ల అన్వి, ఆమె తల్లిదండ్రులు తన పెళ్లి విషయంలో ఒత్తిడి తీసుకువచ్చినట్టు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన తిరస్కరించంతో వారు బెదిరంపులకు దిగారు. ఒక వేళ తమ మాట వినకపోతే, వేధింపులు, శారీరక సంబంధం పెట్టుకున్నాడనే తప్పుడు ఆరోపణలతో క్రిమినల్ కేసులు పెడతామని వారు హెచ్చరించినట్టు ఫిర్యాదులో ఉంది. ఈ క్రమంలో భయపడిన భగీరథ్, ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి మొదట అన్వి తండ్రికి యాభై వేల నగదు ఇచ్చామన్నారు. అయితే వారు అంతటితో ఆగకుండా తమ డిమాండ్‌ను ఐదు కోట్లకు పెంచారని తెలిపారు. ఆ డబ్బు ఇవ్వకుంటే అన్వి తల్లి ఆత్మహత్య చేసుకుంటుందని, ఆ నెపం భగీరథ్‌పైనే వేస్తామని వారు బెదిరించినట్టు పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ద్వారా తెలుస్తోంది.

హనీ ట్రాప్ అంటున్న భగీరథ్

తెలంగాణ రాజకీయాల్లో మరో కలకలం. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక మైనర్ బాలికపై లైంగిక వేధింపులు, అత్యాచారం జరిగినట్టు సమాచారం అందడంతో పోలీసులు రంగంలోకి దిగారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం, బాధితురాలు మైనర్ కావడంతో ఫోక్సో చట్టం కింద నమోదు చేశారు. అందిన సమాచారం ప్రకారం, ఈ ఘటనలో బాధితురాలు కేవలం 17 సంవత్సరాల వయసు ఉన్న బాలిక. భగీరథ్ సదరు బాలికకు మద్యం తాగించి, తనపై అత్యాచారం చేసినట్టు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. మొయినాబాద్లోని ఒక ఫామ్ హౌజ్‌తోపాటు మరో రెండు ప్రాంతాల్లో జరిగినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడానికి వచ్చినప్పుడు పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నిన్న అర్ధరాత్రి సుమారు 6 గంటలపాటు పోలీస్ స్టేషన్ వేదికగా హైడ్రామా నడిచింది. నిందితుడు కేంద్రమంత్రి కుమారుడు కావడంతో పోలీసులు తీసుకోవడానికి మొద వెనుకడుగు వేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే బాధితుల ఒత్తిడి మేరకు పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. అయితే ఇదంతా హనీ ట్రాప్‌ను బండి భగీరథ్ కేసు నమోదు చేశారు. కరీంనగర్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ప్రకారం చాట్ల అన్వి అనే యువతి తనతో స్నేహం పేరుతో పరిచయం పెంచుకుందని, ఆ పరిచయంతో ఆమె తన కుటుంబ వేడుకలకు, గ్రూప్ మీటింగ్స్‌కు ఆహ్వానించేంది. కొన్ని పవిత్ర స్థలాలకు కూడా వెళ్లినట్టు సమాచారం. అయితే కొంత కాలం తర్వాత తన అసలు రంగును బయటపడిందని, చాట్ల అన్వి, ఆమె తల్లిదండ్రులు తన పెళ్లి విషయంలో ఒత్తిడి తీసుకువచ్చినట్టు పేర్కొన్నారు. ఈ ప్రతిపాదన తిరస్కరించంతో వారు బెదిరంపులకు దిగారు. ఒక వేళ తమ మాట వినకపోతే, వేధింపులు, శారీరక సంబంధం పెట్టుకున్నాడనే తప్పుడు ఆరోపణలతో క్రిమినల్ కేసులు పెడతామని వారు హెచ్చరించినట్టు ఫిర్యాదులో ఉంది. ఈ క్రమంలో భయపడిన భగీరథ్, ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి మొదట అన్వి తండ్రికి యాభై వేల నగదు ఇచ్చామన్నారు. అయితే వారు అంతటితో ఆగకుండా తమ డిమాండ్‌ను ఐదు కోట్లకు పెంచారని తెలిపారు. ఆ డబ్బు ఇవ్వకుంటే అన్వి తల్లి ఆత్మహత్య చేసుకుంటుందని, ఆ నెపం భగీరథ్‌పైనే వేస్తామని వారు బెదిరించినట్టు పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ద్వారా తెలుస్తోంది.

## నేడు తెలంగాణ లో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన!



హైదరాబాద్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా నేడు తెలంగాణలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా.తెలంగాణ రాష్ట్రంలో రూ"9.400 కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాలు పారిశ్రామిక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దీనిలో భాగంగా.రూ 2.360 కోట్లతో జహీరాబాద్ ఇంటి గ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి శంకుస్థాపన చేయనున్నారు.ప్రధాని మోడీ సభ ఏర్పాట్లకు సంబంధించి పార్టీ రాష్ట్ర నేతల మధ్య సమన్వయం సంపూర్ణంగా ఉంది ముఖ్య నేతలంతా మమేకమై ప్రచారం చేస్తున్నారు.అన్ని ప్రాంతాలకు వెళ్లి సభకు తరలిరావాలని పిలుపునిస్తున్నారు.గోడలపై వాల్ రైటింగ్,బైక్ ర్యాలీలు ఇలా ఊరు వాడ పండగ వాతావరణం లో జనాన్ని ఆహ్వానిస్తున్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా సభా ప్రాంగణం మొత్తం జర్మన్ టెంట్లు వేసి ప్రజలకు మంచినీరు,మజ్జిగ ప్యాకెట్లు,విరివిగా ఏర్పాటు చేస్తున్నారు.నరేంద్ర మోడీ రాకతో మహా నగరం కాస్తా మొత్తం కాషాయమ యం కానుంది.జన సమీకరణ కోసం బిజెపి శ్రేణులు ప్రత్యేక రైళ్లు,ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేశారు

## బెంగాల్ సీఎంగా సువేందు అధికారి పాల్గొన్న ఎన్డీయే పాలిత సీఎంలు

వార్తా 3 లో

# ఈ నెల12 నుంచి 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

## ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంతో రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి గారు అధికారులను ఆదేశించారు.

అధిక రద్దీ ఉన్న చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్.ఓ, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పని వేళలను ఈ నెల 12వ తేదీ నుంచి పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పదిహేను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో అవసరమైతే మరింత సమయాన్ని పెంచడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అదేవిధంగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని మంత్రి గారు అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా రిజిస్ట్రేషన్ల రద్దీ పెరిగిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను గుర్తించి, అవసరానికి అనుగుణంగా అదనపు సమయాన్ని పెంచాలని సూచించారు.



అలాగే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ జరిగే తహసీల్దార్ కార్యాలయాలను కూడా సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత, వేగం, ప్రజలకు సౌకర్యం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పనిచేస్తోందని దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రిజిస్ట్రేషన్ల ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు ను మంత్రిగారు ఆదేశించారు.

# బేటీ బచావో కేవలం నినాదమేనా?

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకుపై ఫోక్సో కేసు వ్యవహారంలో ప్రధాని మోదీని ప్రశ్నించిన కేటీఆర్



మిగతా 2లో

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన ఫోక్సో (గూజూూ) కేసు వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి (దీ=ూ) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాధితురాలికి జరుగుతున్న అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేస్తూ, అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ఇటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు.

ప్రధాని మోదీకి సూటి ప్రశ్నలు కురిపించిన కేటీఆర్

"ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు, మీ 'బేటీ బచావో' అనేది కేవలం ఒక నినాదానికే పరిమితమా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బర్తరఫ్ ఎప్పుడు చేస్తారో చెప్పాలి అన్నారు. కేంద్రమంత్రి కొడుకుపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని నిలదీశారు. లేక బండి సంజయ్, మరియు ఆయన కొడుకుకు ఏమైనా ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయా అని అడుగుతూ.. నైతిక బాధ్యత వహించి బండి సంజయ్ ఎప్పుడు రాజీనామా చేస్తారు? లేదా ఆయనను మంత్రివర్గం నుండి ఎప్పుడు బర్తరఫ్ చేస్తారు? చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజాబలం

10 మే 2026 ఆదివారం

# లాభాలు పండిస్తున్న యుద్ధం...

ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా, ప్రపంచవ్యాప్తంగా సామాన్యులు ఆర్థిక భారంతో సతమతమవుతుంటే, కొన్ని కంపెనీలు భారీ లాభాలు గడిస్తున్నాయి.యుద్ధం సృష్టించిన అనిశ్చితితో పాటు ఇరాన్ 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్'ను మూసివేయడం వల్ల ప్రజల జీవన వ్యయం భారీగా పెరిగింది. దీని ప్రభావం కంపెనీలు, కుటుంబాలు, ప్రభుత్వాల బడ్జెట్‌లపై తీవ్రంగా పడింది.ఇలా ఒకవైపు అనేకమంది ఆర్థికంగా కుదేలై దివాలా అంచున నిలబడితే, మరోవైపు యుద్ధ సమయాల్లో ఎక్కువ లాభాలు పొందే వ్యాపారాలు, అస్థిరమైన ఇంధన ధరల ద్వారా లబ్ధి పొందే మరికొన్ని సంస్థలు మాత్రం రికార్డు స్థాయిలో సంపాదనను కళ్ల చూస్తున్నాయి.ఇరాన్ యుద్ధం కారణంగా ఇప్పటిదాకా కనిపించిన అతిపెద్ద ఆర్థిక ప్రభావం ఇంధన ధరల పెరుగుదలే.ప్రపంచంలోని చమురు, సహజ వాయువులలో దాదాపు ఐదో వంతు (20 శాతం) 'స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్' ద్వారా రవాణా అవుతుంది. అయితే, ఫిబ్రవరి చివరి నాటికి ఈ రవాణా దాదాపు పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా ఇంధన మార్కెట్లలో ధరల హెచ్చుతగ్గులు ఒక 'రోలర్ కోస్టర్'లా మారిపోయాయి.ఈ పరిస్థితిని ప్రపంచంలోని కొన్ని అతిపెద్ద చమురు, గ్యాస్ కంపెనీలు తమకు అనుకూలంగా మార్చుకుని భారీగా లాభపడ్డాయి.ప్రధానంగా ఐరోపాకు చెందిన దిగ్గజ చమురు సంస్థలు లబ్ధి పొందాయి.ఈ కంపెనీలకు సొంతంగా ట్రేడింగ్ విభాగాలు ఉండటంతో, మార్కెట్‌లో ధరల్లో వచ్చిన భారీ మార్పులను తమకు అనుకూలంగా మార్చుకుని లాభాలు పెంచుకోగలిగాయి.ముఖ్యంగా బ్రిటిష్ పెట్రోలియం (బీపీ) కంపెనీ లాభాలు ఈ ఏడాది మొదటి మూడు నెలల్లోనే రెండింతలు పెరిగి 3.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.30,230 కోట్లు)కు చేరుకున్నాయి. తన ట్రేడింగ్ విభాగం కనబరిచిన 'అసాధారణ' పనితీరు వల్లే ఈ స్థాయిలో లాభాలు వచ్చాయని సదరు కంపెనీ పేర్కొంది.షెల్ కంపెనీ తన మొదటి త్రైమాసిక లాభాలు 6.92 బిలియన్ డాలర్ల (సుమారు రూ.65,379 కోట్లు)కు పెరిగినట్లు నివేదించింది. ఇది విశ్లేషకుల అంచనాలను కూడా మించిపోయింది.మరో అంతర్జాతీయ దిగ్గజ సంస్థ 'టోటల్ ఎనర్జీస్' చమురు, ఇంధన మార్కెట్లలోని హెచ్చుతగ్గుల కారణంగా 2026 మొదటి త్రైమాసికంలో తన లాభాలను దాదాపు మూడో వంతు పెంచుకుని, 5.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.51,014 కోట్లు)కు చేరుకుంది.మధ్యప్రాచ్యంలో ఇంధన సరఫరాకు ఏర్పడిన ఆటంకాల కారణంగా అమెరికా దిగ్గజ సంస్థలు ఎక్సాన్ మొబిల్, షెవ్రాన్ ఆదాయాలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే తగ్గాయి.అయితే, ఈ రెండు కంపెనీలు విశ్లేషకుల అంచనాలను మించి రాణించాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి కంటే చమురు ధరలు ఇప్పటికీ గణనీయంగా ఎక్కువగానే ఉండటంతో, ఈ ఏడాది గడిచేకొద్దీ తమ లాభాలు మరింత పెరుగుతాయని అవి భావిస్తున్నాయి.కొన్ని అతిపెద్ద బ్యాంకులు కూడా ఇరాన్ యుద్ధ సమయంలో తమ లాభాలను భారీగా పెంచుకున్నాయి.జేపీ మోర్గాన్ ట్రేడింగ్ విభాగం 2026 మొదటి మూడు నెలల్లో రికార్డు స్థాయిలో 11.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1,09,585 కోట్లు) ఆదాయాన్ని ఆర్జించింది. ఇది ఆ బ్యాంక్ మొత్తం మీద తన చరిత్రలోనే రెండవ అతిపెద్ద త్రైమాసిక లాభాన్ని నమోదు చేయడంలో సహాయపడింది.అలాగే బ్యాంక్ ఆఫ్ అమెరికా, మోర్గాన్ స్టాన్లీ, సిటీ గ్రూప్, గోల్డ్‌మన్ సాక్స్, వెల్స్ ఫార్గో వంటి మిగిలిన 'బిగ్ సిక్స్' బ్యాంకులన్నీ కూడా ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో గణనీయమైన లాభాలను సాధించాయి.మొత్తంగా, ఈ బ్యాంకులు 2026 మొదటి మూడు నెలల్లో 47.7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4,50,621 కోట్లు) లాభాలను నివేదించాయి.భారీ స్థాయిలో జరిగిన ట్రేడింగ్ లావాదేవీలు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులకు, ముఖ్యంగా మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ సాక్స్ సంస్థలకు బాగా లబ్ధి చేకూర్చాయి" అని వెల్త్ క్లబ్ ప్రధాన ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ సుసానా స్ట్రీటర్ పేర్కొన్నారు.పెట్టుబడిదారులు రిస్క్ ఎక్కువగా ఉండే స్టాక్స్, బాండ్లను వదిలించుకుని, సురక్షితమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి పోటీ పడటంతో ట్రేడింగ్‌కు పెరిగిన డిమాండ్ వాల్ స్ట్రీట్ రుణదాతలకు బాగా కలిసివచ్చింది.అలాగే, ఆర్థిక మార్కెట్లలో నెలకొన్న అస్థిరతను సొమ్ము చేసుకోవాలని పెట్టుబడిదారులు ప్రయత్నించడం వల్ల కూడా ట్రేడింగ్ లావాదేవీల పరిమాణం గణనీయంగా పెరిగింది."యుద్ధం వల్ల తలెత్తిన అస్థిరత ట్రేడింగ్ ఒక్కసారిగా పెరగడానికి కారణమైంది. పరిస్థితులు మరింత విషమిస్తాయన్న భయంతో కొందరు పెట్టుబడిదారులు తమ స్టాక్స్‌ను విక్రయించగా, మరికొందరు తక్కువ ధరల్లో కొనుగోలు చేశారు. ఇది మార్కెట్ మళ్లీ పుంజుకోవడానికి దోహదపడింది" అని స్ట్రీటర్ విశ్లేషించారు.ఎఫ్-35 ఫైటర్ జెట్ భాగాల సహా వివిధ ఉత్పత్తులను తయారుచేసే బీఏఈ సిస్టమ్స్, ట్రేడింగ్ అప్‌డేట్‌లో ఈ ఏడాది అమ్మకాలు, లాభాల్లో బలమైన వృద్ధిని ఆశిస్తున్నట్లు తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న 'రక్షణపరమైన ముప్పులు' ప్రభుత్వ రక్షణ వ్యయాన్ని పెంచుతున్నాయని, ఇది తమ కంపెనీకి 'అనుకూలమైన వాతావరణాన్ని' సృష్టించిందని ఆ సంస్థ పేర్కొంది.ప్రపంచంలోని అతిపెద్ద రక్షణ కాంట్రాక్టర్లలో మూడు సంస్థలైన లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, నార్త్రోప్ గ్రూమ్మన్ 2026 మొదటి త్రైమాసికం చివరి నాటికి తమ వద్ద రికార్డు స్థాయిలో ఆర్డర్లు పేరుకుపోయినట్లు నివేదించాయి.అయితే, గత కొన్నేళ్లుగా విపరీతంగా పెరిగిన రక్షణ రంగ సంస్థల షేర్లు, మార్చి మధ్య కాలం నుంచి తగ్గుముఖం పట్టాయి. ఈ రంగంలోని షేర్ల విలువ వాస్తవ స్థాయి కంటే ఎక్కువగా ఉందనే ఆందోళనల మధ్య ఈ క్షీణత కనిపిస్తోంది.

# బేటీ బచావో కేవలం నినాదమేనా?

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకుపై పోక్సో కేసు వ్యవహారంలో ప్రధాని మోదీని ప్రశ్నించిన కేటీఆర్

**కంద్రమంత్రి బండి సంజయ్ ని ఎప్పుడు బర్తరఫ్ చేస్తారో చెప్పాలి అని డిమాండ్**

**కాంగ్రెస్ కేంద్ర మంత్రి కోసం స్థానిక కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న పక్షపాతంపై రాహుల్ గాంధీలను నిలదీసిన కేటీఆర్**

**ఉన్నావ్ కేసులో బాధితురాలికి అండగా నిలబడిన రాహుల్ గాంధీ, ఇప్పుడు హైదరాబాద్ వచ్చి ఈ బాధితురాలికి అండగా నిలబడరా?**

**బిజెపితో కుమ్మక్కు అయి స్థానిక కాంగ్రెస్ ప్రభుత్వం బాలిక కుటుంబాన్ని వేధిస్తుందన్న కేటీఆర్**

**తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో జంగిల్ రాజ్ గా మారిందని విమర్శ**

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో 'జంగిల్ రాజ్' - రాహుల్ గాంధీపై విమర్శలు

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుబడుతూ రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. "తెలంగాణలో మహిళపై అత్యాచారం జరిగితే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కనీసం కేసు నమోదు చేయకుండా వేధింపులకు గురి చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో తెలంగాణ ఒక జంగిల్ రాజ్ గా మారిపోయింది అన్నారు.

ఒక మైనర్ బాలిక అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినా, పోలీస్ శాఖ ఎందుకు స్పందించలేదు?FIR నమోదు చేయడానికి బాధితురాలు మూడు నెలల పాటు ఎందుకు పోరాడాల్సి వచ్చింది? అని ప్రశ్నించారు. ఉన్నావ్ కేసులో బాధితురాలికి అండగా నిలబడిన రాహుల్ గాంధీ, ఇప్పుడు హైదరాబాద్ వచ్చి ఈ బాధితురాలికి అండగా నిలబడరా? లేక మీ న్యాయం తెలంగాణ బాధితులకు వర్తించదా? అని ప్రశ్నించారు.

తెలంగాణ పోలీసుల తీరుపై ఆగ్రహం

బాధితురాలిపైనే ఎదురు కేసులు పెట్టడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. "ఏ నిబంధన ప్రకారం ఒక మైనర్ బాలికపై హనీ-ట్రాప్, వసూళ్ల కేసు నమోదు చేశారు?" అని పోలీసులను నిలదీశారు. బాధితురాలిని, ఆమె కుటుంబాన్ని నేరస్తుల్లా చూస్తూ వేధించడం దుర్మార్గమన్నారు. న్యాయం కోసం తిరుగుతూ ఆ బాలిక ఇప్పటికే రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేసిందని, ఇప్పుడు ఆమెనే నిందిస్తూ 'విక్టిమ్ షేమింగ్' () చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేపీ - కాంగ్రెస్ 'అపవిత్ర ఒప్పందం'

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బీజేపీకి ఒక 'ఫ్రాంచైజీ'లా మారిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఒక మైనర్ బాలిక గౌరవం విషయంలో రెండు పార్టీలు కలిసి ఒక అపవిత్రమైన, అసహ్యకరమైన ఒప్పందానికి వచ్చాయా? అని అనుమానం వ్యక్తం చేశారు. అందుకే ఇతర పోక్సో కేసు నిందితుల మాదిరిగా మంత్రి కుమారుడిని ఎందుకు విచారించడం లేదని ప్రశ్నించారు.

'మనం ఎంతటి దుర్భరమైన, భయంకరమైన నరకంలో జీవిస్తున్నామో ఈ ఘటనను చూస్తే అర్థమవుతోందన్నారు. గతంలో మన మహిళల గౌరవం కోసం అణచివేతదారులపై, ప్రభుత్వాలపై పోరాడాం. ఆడబిడ్డల రక్షణ కోసం అవసరమైతే మరో మిలియన్ సార్లు పోరాడటానికి మేము సిద్ధంగా ఉన్నాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దుదాం:రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తో పాటు ఇతర సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పెరుగుతున్న నగరీకరణ వల్ల సమీప భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి చెబుతూ, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

"హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. కీలకమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఉపరితల రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్‌ల వంటి మూడు విధానాల్లో ట్రాఫిక్‌కు సులభతరమైన రవాణా మార్గాలను కల్పించే విధానాన్ని ఎంచుకున్నాం.

ట్రాఫిక్ నియంత్రణ కోసం కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే చేపడితే సరిపోదు. బహుళ విధానాల్లో రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం" అని వివరించారు.

"తెలంగాణ రాష్ట్రాన్ని CURE, PURE, RARE విభాగాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాం. ప్రధానంగా ఔటర్ రింగ్ రోడ్డు లోపలి కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (CURE) ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా గుర్తించాం. ఓఆర్ఆర్ బయట నుంచి రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న పెరి అర్బన్ రీజియన్ ఎకానమి (PURE) ప్రాంతాన్ని ప్రధానంగా మాన్యుఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించాం.

ఆ తర్వాత రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (RARE) గా వ్యవసాయం, దానిక అనుబంధ రంగాలను అభివృద్ధి చేయాలని ప్రణాళికలను సిద్ధం చేశాం" అని చెప్పారు.

"రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ రైజింగ్ 2047 మాస్టర్ ప్లాన్‌ను ఇప్పటికే ఆవిష్కరించుకున్నాం. లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడుతున్నాం. కాలుష్య కోరల నుంచి హైదరాబాద్‌ను కాపాడటానికి మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు నగర సంస్కృతికి అనుసంధానించబోతున్నాం.

నగరంలో కాలుష్య నియంత్రణకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగానే ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను ప్రవేశపెడుతున్నాం. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.

హైదరాబాద్ నగర తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం తదితర అంశాలపై ప్రభుత్వ ప్రణాళికలను సమావేశంలో ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాండింగ్ కమిటీకి వివరించారు. నగర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం సహకరించేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వం స్టాండింగ్ కమిటీకి విజ్ఞప్తి చేసింది.మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చేపట్టడం ఒక విప్లవాత్మక నిర్ణయమని స్టాండింగ్ కమిటీ చైర్ పర్సన్‌తో పాటు ఇతర సభ్యులు అభివర్ణించారు. హైదరాబాద్ నగర జీవన స్థితిగతులను మెరుగుపరిచే మూసీ పునరుజ్జీవ తరహా ప్రాజెక్టు దేశంలోనే మొదటిదని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్ నగర ప్రజలకు ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టును చేపట్టడంపై ఈ సందర్భంగా కమిటీ ముఖ్యమంత్రి ని అభినందించింది. దీంతో పాటు రాష్ట్రంలో మహిళాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కమిటీ ప్రశంసించింది. అంతకుముందు సమావేశం ప్రారంభంలో స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌తో పాటు సభ్యులను ముఖ్యమంత్రి గారు సత్కరించారు.

తెలంగాణ రాష్ట్రాన్ని 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక శక్తిగా ఎదగడానికి అనుగుణంగా సమగ్ర ప్రణాళికలతో రూపొందించిన తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను స్టాండింగ్ కమిటీ సభ్యులకు అందజేశారు.

## రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను గాలికి వదిలేసి నిర్లక్ష్యం చేస్తోంది

## చిన్న కోడూరు లో హరీష్ రావు పర్యటన



సిద్దిపేట సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ లో సన్ ఫ్లవర్, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి హరీష్ రావు సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో 40 రోజులుగా నిరీక్షిస్తున్న రైతుల బాధలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

తరువాత మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, వడగండ్ల వానలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను గాలికి వదిలేసి నిర్లక్ష్యం చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లపై ఒక్క రివ్యూ మీటింగ్ కూడా పెట్టలేదు. ఆనాడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వరి కోతలు మొదలవుతున్నాయంటేనే మంత్రులు, అధికారులతో మీటింగ్ పెట్టి సంచులు, లారీలు, పైసలు అన్నీ సిద్ధం చేసి రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నారని అన్నారు.

ఇవాళ ధాన్యం కేంద్రాల్లో నెలన్నర రోజులుగా రైతులు పడిగాపులు కాస్తున్నా ముఖ్యమంత్రికి గానీ, జిల్లా మంత్రులకు గానీ కనీస పట్టింపు లేదు. ఏ ఒక్క మంత్రి అయినా వడ్లు, మక్కలు, శనగలు, సన్ ఫ్లవర్ కొనుగోళ్లపై ఒక్కసారైనా రివ్యూ చేశారా? రైతులను ఆదుకోని ప్రభుత్వం ఒక ప్రభుత్వమే కాదు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఎరువులు, విత్తనాలు, కరెంటు, రైతుబంధు, సాగునీరు.. ఇలా అన్నింటికీ ఇబ్బందులు పడుతున్నారు. ఆఖరికి పండించిన పంట అమ్ముకోవడానికి కూడా నెలల తరబడి కల్లాల్లోనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి వుందని అన్నారు. చిన్నకోడూరు ప్రాంతంలో ఎకరాకు 9-10 క్వింటాళ్ల సన్ ఫ్లవర్ పండుతుంటే, కేవలం ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే కొంటామని నిబంధన పెట్టారు. తీరా చూస్తే ఆ ఆరున్నర క్వింటాళ్లు కూడా కొనడం లేదు. కేంద్ర ప్రభుత్వ కోటా అయిపోయింది అంటున్నారు. కేంద్రం అయితే ఏంటి? రాష్ట్రం అయితే ఏంటి? రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది కాదా? పొద్దున లేస్తే రేవంత్ రెడ్డి పంటల మార్పిడి చేయండి, వరి తగ్గించండి అంటాడు. మరి రైతులు సన్ ఫ్లవర్, మక్కలు, శనగలు, జొన్నలు వేస్తే ఎందుకు కొనడం లేదు? నువ్వే మార్పిడి చేయమంటావు, మళ్లీ నువ్వే పంట కొనవు.. ఇదేం ద్వంద్వ విధానమని ఆయన ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వ్యవసాయంపై ఉన్న నిర్లక్ష్యాన్ని విడనాడాలి. యూరియాపై ఉన్న బ్యాన్ ను ఎత్తివేసి రైతులకు అందుబాటులో ఉంచాలి. వడ్లతో పాటు సన్ ఫ్లవర్, జొన్నలు, మక్కలు, శనగలు తక్షణమే యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర అందించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

## బంగారు గొలుసు చోరీ కేసులో ముద్దాయి అరెస్ట్


ఆళ్లగడ్డ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని దొర్నిపాడు మండలం కొండాపురం గ్రామంలో ఏప్రిల్ 29 వ తేదీన రామలక్ష్మమ్మ అనే వృద్ధురాలు మెడ లోని 6 లక్షల విలువ చేసే 4.2 తులాల బంగారు గొలుసును చోరీ చేసిన దొంగను వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. డి.ఎస్.పి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు అదే గ్రామానికి చెందిన జగన్మోహన్ రెడ్డి అనే వ్యక్తి భూసార పరీక్షలు చేయడానికి వచ్చినట్టు ఆమెను ఆమెను బెదిరించి మెడలోని గొలుసును చేరు చేశాడన్నాడు. రూరల్ సీఐ రమణ, దొర్నిపాడు ఎస్సై ఎస్సై శ్రీకాంత్ ఈ కేసులో కృషిచేసి పది రోజుల వ్యవధిలోని నిందితుడిని పట్టుకోవడం జరిగిందని అభినందించారు. నిందితుని రిమాండ్ కు పంపుతున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

# మన జాతి ఆణిముత్యం పండుగ సాయన్న

### సాయన్న ను ఆదర్శం గా తీసుకొని బీసీలు సంఘటి తమై రాజ్యాధికార సాధన కై పోరాడాలిలి ఉమ్మడి పాలమూరు (ఉమ్మడి మహబూబ్ నగర్) జిల్లా ప్రజల రియల్ హీరో పండుగ సాయన్న

.మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట్ మండలం మెరుగోని పల్లె లో ముదిరాజ్ (తెలుగు )సామజిక వర్గానికిచెందినసాయమ్మ,అనంతయ్యదంపతులకు జన్మించారు,1650 నుంచి 1707 మధ్య కాలానికి చెందిన పండుగ సాయన్న గ్రామీణ క్రీడల్లో ఆరితేరినవాడు. 20 కేజీల గుండును అవలీలగా ఒక్కచేత్తో లేపే వాడట. ఎద్దులబండిని ఒక్క చేతితో లేపి విసిరేవాడు. పేదలను హింసించే వారు ఎంతటి వారైనా తిరగబడే మనసత్వం ఆయన లోని దైర్యానికి నిదర్శనం. నిజాం కాలంలో చిన్న, సన్నకారు రైతులు పండించిన పంటలను దోచుకుంటున్న దొరలు, దేశుముఖ్ లు, రజాకారుల కు ఎదురోడ్డి పోరాటం చేసి వారి గాదెలలోనిల్వ ఉన్న ధాన్యాన్ని నిరుపేద రైతులకు పేదలకు పంచి వారి ఆకలిని తీర్చే వాడు. పేద రైతుల భూ పత్రాలను తాకట్టు పెట్టుకొని చక్ర వడ్డీ లు వసూలు చేస్తూ వారి పొలం లోనే వారితో ఊడిగం చేయించుకోవడం గిట్టని పండుగ సాయన్న ఆ నాటి నిరంకుశ నిజాం అధికారులను ఎదురించి పోరాడి దున్నే వాడికే భూమి మీద హక్కు ఉండాలని భూ స్వాముల ఇనపెట్టెలను పగులగొట్టి అప్పు పత్రాలను చించి వేసి రైతులకు భూ పత్రాలను ఇచ్చి అండగా ఉండేవారు.కరువు కాటకాలు వచ్చినప్పుడు ఆకలి కి అలమటిస్తున్న పేదల ఆకలి ని తీర్చడానికి భూ స్వాములు,దొరల గడిలను బద్దలు కొట్టి నిల్వ ఉంచిన ధాన్యాన్ని కొల్లగొట్టి తెచ్చి పెద్దలుకు పంచి ఆకలి ని తీర్చడం గిట్టని వారు పండుగ సాయన్న ను బందీ పోటుగా చిత్రీకరించారు.

ఆనాడు గ్రామాల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజలు భూస్వాముల దగ్గర వంగివంగి నడవాల్సి వచ్చేది. వూర్లో పెత్తందార్లకు ఎదురుతిరిగి మాట్లాడేవారు కాదు. ఈ పరిస్థితులను చూసిన పండుగ సాయన్న ప్రజర్విల్లాడు. ఆయనలో



విప్లవాగ్నులు చెలరేగాయి. ఈ స్థితిని మార్చాలన్న తలంపు ఆయనలో పెరిగింది. ఎదిరించటానికి సాయుధుడయ్యాడు. సాయుధ దళాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.

స్వంతంగా ఆయుధాలను కూడా తయారు చేసుకున్నాడు ఆధిపత్య శక్తులపై యుద్ధం చేసే క్రమంలో ప్రజలను చైతన్యపరచాడు. బహుజనులపై ఏ వర్గాలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయో గుర్తించి దాన్ని ఎదుర్కొనటానికి జ్ఞానమనే చదువు కావాలని చదువుకున్నాడు. బహుజన వర్గాలు చదువుకోవాలన్న సందేశం ఇచ్చాడు.ఆ రోజుల్లో పేదల పెళ్ళిళ్లు జరగాలంటే చాలా కష్టంగా ఉండేది. వారికీ అండగా నిలబడి ధన, దాన్యాలు సహాయం చేసి ఆదుకునే వాడు.క్రమంగా పండుగ సాయన్న పేరు చుట్టు పక్కల ప్రాంతాలకు వ్యాపించింది.

అతనిని పట్టుకోవడానికి దొరలు ప్రయత్నించిన ప్రతి సారి తప్పించుకొని వారికి చుక్కలు చూపించేవాడు.సాయన్నను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్న భూ స్వాములు, పెత్తందారులు నిజాం సైన్య సహకారం కోరారు, పండుగ సాయన్న అనుచరులలో ఒకరిని బందించి ఆయన ఉండే స్థావరాన్ని తెలుసుకొని ఆయనను బందించి ప్రాణాలు తీశారు. నాటి కాలమాన పరిస్థితులలో వెనక బడిన కులానికి చెందిన ఒక వ్యక్తి దొరలకుఎదురువెళ్ళడమేఅసాధ్యం, అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన తిరుగు బహుట ఎగుర వేసిన మహనీయుడు మహనీయుడు మన పండుగ సాయన్న తెలంగాణ రాబిన్ హుడ్ గా ప్రఖ్యాతి గాంచారు, పీడన, దోపిడీ, వివక్ష ను రూపు మాపడానికి 17 శతాబ్దంలోనే బీజం వేసిన మన జాతి ఆణిముత్యం, బీసీలుసంఘటి తమై పండుగ సాయన్నను ఆదర్శంగా తీసుకొని రాజ్యాధికార సాధనకై పోరాడాలి.

వ్యాస కర్త
బూర్గుపల్లి కృష్ణ యాదవ్ హీూ
బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు,సెల్, 9866170384

# మోడీద్వారానే బిసిలకు న్యాయం

### తెలంగాణ బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బిజెపి నాయకురాలు దండు లక్ష్మీ ముదిరాజ్

హైద్రాబాద్ మే 9: ఈనెల 10న హైదరాబాద్ నగరానికి విచ్చేస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి సికింద్రాబాద్ లోని బౌద్ధ నగర్ డివిజన్ ఎల్ ఆర్ నగర్ నుండి పెద్ద ఎత్తున బిజెపి శ్రేణులు అభిమానులు తరలిరావాలని తెలంగాణ బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బిజెపి నాయకురాలు దండు లక్ష్మీ ముదిరాజ్ పిలుపునిచ్చారు,ఈ మేరకు శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ .కృష్ణయ్య ను కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తమ డివిజన్ నుంచి పెద్ద ఎత్తున స్వాగతం పాలుతున్నట్లు తెలిపారు.మోడీ ద్వారానే బిసిలకు న్యాయం జరుగుతుందని,మోడీద్వారానే మహిళబిల్లు సాద్యపడుతుందన్నారు. బౌద్ధ నగర్ డివిజన్ చెందిన బిజెపి నాయకులు సారంగపాణి, కృష్ణమూర్తి,రవి ప్రసాద్ ల నేతృత్వంలో పెద్ద ఎత్తున ఎల్లాఆర్ నగర్ కు చెందిన బిజెపి కార్యకర్తలు అభిమానులు నరేంద్ర మోడీకి స్వాగతం పలకడానికి పెరేడ్ గ్రౌండ్ కు తరలి వెళ్తున్నట్లు దండు లక్ష్మి ముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ మహిళా సంఘం నాయకులు యాదమ్మ, మమత, రూపవతి ఉపేంద్ర, లక్ష్మి ,భాగ్య తదితరులు పాల్గొన్నారు.



## మండపేటలో ఘోర రోడ్డుప్రమాదం

### ఇద్దరు స్పాట్ డెడ్



తూర్పుగోదావరి జిల్లా మండపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.స్థానికుల వివరాల ప్రకారం.. మండపేట బైపాస్ రోడ్‌లోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఇసుక టిప్పర్ లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరూ ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపా

# బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

## పాల్గొన్న ఎన్డీయే పాలిత సీఎంలు

కోల్ కత్తా, మే 9, (న్యూస్ పల్స్) పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో 2026, మే 9వ తేదీ ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోనుంది. దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, స్వాతంత్ర్యం తర్వాత తొలిసారిగా బెంగాల్ గడ్డపై భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కొలువుదీరింది. కోల్‌కతాలోని చారిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కన్నుల పండువైన కార్యక్రమంలో బీజేపీ శాసనసభాపక్ష నేత సువేందు అధికారి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆయన చేత పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సువేందు అధికారి ప్రధాని నరేంద్ర మోదీ పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం అక్కడున్న వేలాది మంది కార్యకర్తలను భావోద్వేగానికి గురిచేసింది. ప్రధాని మోదీ ఆయనను ఆలింగనం చేసుకుని అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమం కోసం మే 9వ తేదీని ఎంచుకోవడంలో ఒక విశిష్టత ఉంది. నేడు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, ప్రధాని మోదీ, సువేందు అధికారి తొలుత ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బెంగాలీ సంస్కృతిని, సంప్రదాయాలను గౌరవిస్తూ ముందుకు సాగుతామని సందేశాన్ని ఇచ్చారు. వేదిక అంతా కాషాయమయం కాగా, సువేందు అధికారి కూడా పూర్తి కాషాయ వస్త్రధారణలో మెరిసిపోయారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి దేశంలోని ప్రముఖ నాయకులందరూ హాజరయ్యారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, హర్యానా సీఎం నయాబ్ సింగ్ సైని సహా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు..ముఖ్యమంత్రితో పాటు మరో ఐదుగురు కీలక నేతలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్త ప్రభుత్వంలో సామాజిక సమతుల్యతకు పెద్దపీట వేశారు.

దిలీప్ ఘోష్: బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు. ఖరగ్‌పూర్ స్థానంలో టీఎంసీ అభ్యర్థి ప్రదీప్ సర్కార్‌పై భారీ విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

అగ్నిమిత్ర పాల్: ఫ్యాషన్ డిజైనర్ నుంచి రాజకీయ నాయకురాలిగా ఎదిగిన అగ్నిమిత్ర, అసన్సోల్ సౌత్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మహిళా గళానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఆమె మంత్రి అయ్యారు.

అశోక్ కీర్తానియా: బంగావ్ ఉత్తర్ ఎమ్మెల్యే అయిన ఈయన మతువా వర్గానికి చెందినవారు. గత రెండు పర్యాయాలుగా ఎమ్మెల్యేగా పనిచేస్తున్న ఈయనకు కేబినెట్‌లో చోటు దక్కింది.

క్షుదీరామ్ టుడు: గిరిజన సామాజిక వర్గానికి చెందిన ఈయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. రాణిబంధ్ నియోజకవర్గం నుండి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి నేరుగా మంత్రి పీఠాన్ని అధిరోహించారు.

నిసిత్ ప్రమణిక్: మాజీ కేంద్ర మంత్రి, కూచ్ బెహార్ ఎంపీ. మాతాతంగ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర రాజకీయాల్లో కీలక బాధ్యత చేపట్టారు.

సువేందు అధికారి ప్రస్థానం అత్యంత సాహసోపేతమైనది. ఒకప్పుడు మమతా బెనర్జీకి కుడిభుజంగా ఉన్న ఆయన, టీఎంసీ తీరుపై అసంతృప్తితో బీజేపీలో చేరారు. 2026 ఎన్నికల్లో ఆయన రెండు చోట్ల నందిగ్రామ్, భవానీపూర్) పోటీ చేసి రెండింటిలోనూ గెలుపొందారు. ముఖ్యంగా మమతా బెనర్జీ సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో ఆమెను 15,000 ఓట్ల మెజారిటీతో ఓడించడం ద్వారా తన సత్తా చాటారు.

ఏప్రిల్ 23 , 29 తేదీల్లో రెండు దశల్లో జరిగిన ఎన్నికలు బెంగాల్ ముఖచిత్రాన్ని మార్చేశాయి. మే 4న వెలువడిన ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ 207 స్థానాలతో ప్రభంజనం సృష్టించింది. టీఎంసీ కేవలం 80 స్థానాలకే పరిమితమై అధికారానికి దూరమైంది. బ్రాహ్మణులు, మహిళలు, గిరిజనులు, మతువాలు, యువత బీజేపీకి అండగా నిలవడంతో ఈ భారీ విజయం సాధ్యమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. "సోనార్ బంగ్లా" (బంగారు బెంగాల్) నిర్మాణమే తమ లక్ష్యమని, అవినీతి రహిత పాలనను అందిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. నేటితో బెంగాల్ రాజకీయాల్లో సువేందు శకం అధికారికంగా ప్రారంభమైంది.

అఖండ విజయం.. చారిత్రాత్మక మార్పు

మొత్తం 294 స్థానాలకు గాను 207 స్థానాల్లో అఖండ విజయం సాధించి బీజేపీ చరిత్ర సృష్టించింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీని 80 స్థానాలకే పరిమితం చేసి, బెంగాల్ గడ్డపై కాషాయ జెండాను ఎగురవేయడంలో సువేందు అధికారి పోషించిన వ్యూహాత్మక పాత్ర సామాన్యమైనది కాదు. మమతా బెనర్జీకి ఒకప్పుడు అత్యంత నమ్మినబంటుగా, రవాణా, నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన సువేందు, పార్టీలో అంతర్గత విభేదాల వల్ల 2020లో బీజేపీలో చేరారు. అప్పటి నుండి బెంగాల్‌లో గ్రామస్థాయిలో బలమైన కేడర్‌ను నిర్మిస్తూ బీజేపీకి వెన్నెముకగా నిలిచారు.

బీజేపీ కార్యకర్తకు ప్రధాని పాదాభివందనం

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార వేడుకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రదర్శించిన వినమ్రత అందరినీ ఆకట్టుకుంది. కోల్‌కతాలో జరిగిన ఈ కార్యక్రమంలో 98 ఏళ్ల వయసున్న బీజేపీ సీనియర్ కార్యకర్త మఖన్ లాల్ సర్కార్ పాదాలకు మోదీ నమస్కరించి, ఆయన్ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ భావోద్వేగ దృశ్యానికి అక్కడున్న వేలాది మంది కార్యకర్తలు, మద్దతుదారులు హర్షధ్వానాలు చేశారు.మఖన్ లాల్ సర్కార్‌కు పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంది. 1953లో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే ఉద్యమంలో భాగంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీతో కలిసి కశ్మీర్‌లో ఆయన అరెస్టయ్యారు. అలాంటి సీనియర్ నేత వేదిక వద్దకు వచ్చి పలకరించగానే, ప్రధాని మోదీ ఆయన కాళ్లకు నమస్కరించి గౌరవం చాటారు.పశ్చిమ బెంగాల్‌లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు ముగింపు పలుకుతూ, బీజేపీ తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

నూతన ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేసే ఈ చారిత్రక ఘట్టానికి హాజరయ్యేందుకు ప్రధాని మోదీ కోల్‌కతా వచ్చారు. బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న ఆయనకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య, ముఖ్యమంత్రిగా నియమితులైన సువేందు అధికారి ఘనస్వాగతం పలికారు. 'జై శ్రీరామ్' నినాదాలతో మైదానం మారుమోగింది. అంతకుముందు ఓపెన్ టాప్ వాహనంలో ప్రధాని అభివాదం చేస్తూ వేదిక వద్దకు చేరుకున్నారు.

చంద్రబాబు శుభాభినందనలు

పశ్చిమ బెంగాల్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శు భాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు సేవ చేసేందుకు పదవీ బాధ్యతలు స్వీకరించిన సువేందు అధికారి మంత్రి మండలి సభ్యులకు కూడా చంద్రబాబు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం, ఆయన కన్న వికసిత్ భారత్ స్వప్నం స్ఫూర్తిగా కొత్త ప్రభుత్వం పనిచేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులు, విశ్వాసంతో అధికారం చేపట్టిన సువేందు అధికారి ప్రభుత్వం విజయవంతంగా పదవీకాలం పూర్తి చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు తన శుభాకాంక్షలను తెలియజేస్తున్నానని చంద్రబాబు వివరించారు కోల్ కతాలో జరిగిన సువేందు అధికారి ప్రమాణ స్వీకారోత్సవానికి సీఎం చంద్రబాబు కూడా హాజరయ్యారు. తాజాగా, సోషల్ మీడియాలోనూ బెంగాల్ నూతన సీఎంకు శుభాభినందనలు తెలిపారు.

ప్రజల విజయమన్న పవన్

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన సువేందు అధికారికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.


పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయాన్ని భారత ప్రజల విజయంగా పవన్ అభివర్ణించారు. ముఖ్యంగా భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్మించిన బెంగాల్ గడ్డపై, ఆయన ఆశయాలకు అనుగుణంగా బీజేపీ అధికారం చేపట్టడం ఒక గొప్ప నివాళి అని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాల పోరాటం తర్వాత లభించిన ఈ ఫలితం కార్యకర్తల కృషికి దక్కిన గౌరవమని కొనియాడారు.సరిహద్దు రాష్ట్రమైన బెంగాల్‌లో అక్రమ వలసలు, తీవ్రవాద చొరబాట్లు జాతీయ భద్రతకు ముప్పుగా మారాయని... సువేందు అధికారి నాయకత్వంలోని కొత్త ప్రభుత్వం ఈ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటుందని ఆయన ఆశించారు. హింస, అరాచకాలకు తావులేకుండా పారదర్శకమైన పాలన సాగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి పునాది అని చెబుతూ.. అమిత్ షా, నితిన్ నబిన్, సమిక్ భట్టాచార్యలకు ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# పేద వృద్ధుని అంత్యక్రియలకు విశ్వంలో విలీనం, వెస్సో ట్రస్ట్ ల సాయం

హైద్రాబాద్ మే 9; కార్పెంటర్ వృత్తిలో ఉంటూ జీవనం సాగిస్తున్న కండ్రిక కు చెందిన జయవరపు కోటేశ్వరరావు(62) కొద్ది రోజుల క్రిందట అనారోగ్యంతో కన్నుమూశారు.

పెళ్లి అయిన కొడుకు మరియు కూతురు కూడా ఇదివరకే కన్నుమూశారు. కోటేశ్వరరావు తన భార్య సత్యవతి తో కలిసి కండ్రికలో ఉన్న తమ చిన్న స్వగృహం లో నివసించే వారు.

తమ దగ్గర బంధువుల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో, సత్యవతి స్థానిక నాయకురాలు శనగపాటి జయలక్ష్మి మార్గదర్శనంతో తన భర్త అంత్యక్రియలు పూర్తి చేయడానికి ఆర్థిక సహాయానికై వెస్సో ట్రస్ట్ మరియు విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ లను అభ్యర్థించారు.



స్పందించిన విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ మరియు వెస్సో ట్రస్ట్ లు సంయుక్తంగా 10,000 రూపాయల ఆర్థిక సహాయం సత్యవతి కి అందజేసినట్లు విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పెంటా శ్రీనివాస ఆచార్య ఒక ప్రకటనలో తెలిపారు. వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ అంత్యక్రియలు వంటి పుణ్య కార్యానికి ఇతోధికంగా మద్దతు ఇస్తున్న లక్కోజు పూర్ణిమ కు అభినందనలు తెలిపారు.

# పిఠాపురం నుంచే బాబు స్టార్ట్...

## తమ్ముళ్లకు వార్నింగ్

కాకినాడ, మే 9, పర్సనల్ ఎజెండాలు వద్దు. మీ అభిప్రాయాలు పార్టీ మీద నెట్టొద్దు. కూటమి ముఖ్యం. పార్టీకే ప్రాధాన్యం. ఇది అర్థం చేసుకుంటే బెటర్. లేకపోతే సీరియస్ యాక్షన్ ఉంటుంది. ఇక మీ ఇష్టమంటూ లీడర్లకు, క్యాడర్‌కు ఎన్నోసార్లు క్లియర్ కట్ ఇండికేషన్ ఇస్తూ వచ్చారు సీఎం చంద్రబాబు. పై స్థాయిలో పవన్‌తో తనకు మంచి రిలేషన్ ఉంది..కలిసే ఉంటాం..కలిసే నడుస్తాం ఫిక్స్ అయిపోండని కూడా చెప్పేశారు. ఎక్కడా ఎలాంటి తేడాలు రావడానికి వీళ్లేదని పలుసార్లు హెచ్చరించారు కూడా. కొందరు నేతల తీరుతో కూటమి డిస్టర్బ్ అయ్యే పరిస్థితి వస్తే ఊరుకునేది లేదని చెప్పిన చంద్రబాబు..అన్నంత పని చేశారు.ఏకంగా పార్టీకి లాయలిస్ట్‌గా, సిన్సియర్ కార్యకర్తగా పేరున్న వర్మను పిఠాపురం ఇంచార్జ్ పదవి నుంచి తప్పించి షాక్ ఇచ్చారు చంద్రబాబు.

ఆల్రెడీ పార్టీ కార్యవర్గ సభ్యుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో కూడా ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారితీశారు. ఫ్లెక్సీలు, ఫెక్సీలో ఫోటో కోసం గొడవేంటి అంటూ ఇండైరెక్ట్ గా వర్మకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పుడు ఏకంగా ఆయన్ను పార్టీ ఇంచార్జ్ పదవి నుంచి తొలగించారు. అయితే తనను పిఠాపురం బాధ్యతల నుంచి తప్పించడంపై స్పందించిన వర్మ..పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. వర్మ. ఫక్తు టీడీపీ కార్యకర్త. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా..పవర్‌లో ఉన్నా..వర్మది వన్ లైన్ ఎజెండా..పార్టీ కోసం పని చేయడమే. అయితే గత ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా పిఠాపురం సీటును జనసేన చీఫ్ పవన్ కల్యాణ్‌కు ఇచ్చారు. అప్పుడే వర్మ తన అసంతృప్తిని వ్యక్తం చేయడంతో..చంద్రబాబుతో సహా లోకేశ్ సర్దిచెప్పి భవిష్యత్‌పై భరోసా ఇచ్చారు. ఫ్యూచర్‌లో ఎమ్మెల్సీ లేకపోతే మరేదైనా ఆ స్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పోస్ట్ ఇస్తామని కూడా హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్లుగానే అధిష్టానం మాటకు కట్టుబడి పవన్ కోసం ప్రచారం చేశారు వర్మ. ఆయన ఫ్యామిలీ కూడా పవన్ గెలుపు కోసం హార్ట్ ఫుల్‌గా క్యాంపెయిన్ చేసింది.

ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడ్డాక వర్మకు ఏదో ఒక పదవి ఇస్తారన్న టాక్ నడిచింది. మధ్యలో ఇద్దరు గన్‌మెన్‌లను కూడా ఇచ్చింది ప్రభుత్వం. కానీ ఇప్పటివరకు ఆయనకు ఏ పదవి దక్కలేదు. దీంతో రానురాను వర్మలో అసంతృప్తి బయటపడుతూ వచ్చింది.తనకు ఏ పదవి దక్కలేదన్న అసంతృప్తితో..ఇంటెన్షన్ వేరు..బరస్ట్ అవుతున్నది అందుకోసం కాదు అన్నట్లుగా ఎప్పుడూ ఏదో ఒక ఇష్యూతో వార్తల్లో ఉంటూ వచ్చారు. పిఠాపురంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో చంద్రబాబు ఫోటోను చిన్నగా వేశారని ఓసారి అధికారులపై సీరియస్ అయ్యారు వర్మ. మరోసారి పిఠాపురం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఫ్లెక్సీలో సీఎం ఫోటో లేదంటూ రాద్ధాంతం చేశారు. జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో మాటల యుద్ధం నడిచింది. దీంతో కూటమిలో కుతకుతలతో..పవన్ నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతలకు పొసగట్లేదన్న వార్తలు హల్‌చల్ చేశాయి. ఇక ఇలా చూసుకుంటే పోతే మొదటికే మోసం వస్తుందని భావించిన సీఎం చంద్రబాబు..కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు. వర్మ పార్టీ కోసం పని చేసిన సిన్సియర్ కార్యకర్తే అయినా..ప్రస్తుత పరిస్థితుల్లో కూటమికే చంద్రబాబు ప్రయారిటీ ఇస్తున్నారన్నది ఓపెన్ సీక్రెట్ అయిపోయింది.వార్తా సేవలుఅయితే ఒక్క పిఠాపురంలోనే కాదు..రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతల మధ్య పొసగట్లేదు. కొన్ని చోట్ల అయితే టీడీపీ ఎమ్మెల్యేలు టంగ్ స్లిప్ అవుతూ పార్టీకి తలనొప్పులు తెచ్చుపెడుతున్న పరిస్థితి. ఇలా అన్ని గమనించిన చంద్రబాబు..పిఠాపురం నుంచే ఆపరేషన్ స్టార్ట్ చేశారన్న టాక్ వినిపిస్తోంది. వర్మ లాంటి నేతకే షాక్ ఇచ్చారనే ఇండికేషన్ ఒకటి అయితే..పవన్‌కు, కూటమికి చంద్రబాబు ఇస్తున్న ప్రయారిటీ కూడా ఎక్స్‌పోజ్ చేసినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది.

ఇప్పుడు పదవి నుంచి తప్పించింది వర్మనే అయినా..ఈ సెగ అందరికీ తాకేలా చేయాలన్నదే బాబు ఆలోచనగా చెప్పుకుంటున్నారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన, బీజేపీ కూడా ఇలాగే సైడ్ ట్రాక్ పడితే ఇంతే స్ట్రిక్ట్‌గా బిహేవ్ చేసేలా బాబు రూట్‌మ్యాప్ వేశారని చర్చించుకుంటున్నారు. ఏదేమైనా పిఠాపురం వర్మ విషయంలో బాబు తీసుకున్న డెసిషన్ అయితే పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారింది.

# పంచాయితీ ఎన్నికలకు అంతా సిద్ధం

విజయవాడ, మే 9,స్థానిక సంస్థల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఇదే విషయాన్ని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలతోపాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, నగరపాలక సంస్థలకు సంబంధించిన పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఆరు నెలల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహించాలన్నది ఒక నిబంధన. ఇప్పుడు సీఎం చంద్రబాబు తాజా ప్రకటనతో ప్రభుత్వం వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని చూస్తున్నట్లు అర్థం అవుతోంది. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు వస్తేనే ఆర్థిక సంఘం నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం వాటి ఎన్నికల నిర్వహణపై ప్రత్యేకంగా ఫోకస్ చేసినట్లు అర్థమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకు పైగా పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వాటికి సంబంధించి సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2 తో ముగిసింది. దీంతో సర్పంచులు మాజీలు అయ్యారు. వారి స్థానంలో పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది ప్రభుత్వం. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులకు బ్రేక్ పడే అవకాశం ఉంది. ఇప్పటికే 16వ ఆర్థిక సంఘం సమయం ప్రారంభం అయింది. దాదాపు 15 వేల కోట్ల రూపాయల వరకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. పంచాయితీలకు పాలకవర్గాలు ఉంటేనే ఈ నిధులు మంజూరయ్యేవి. అందుకే వీలైనంత త్వరగా పంచాయతీ ఎన్నికలను పూర్తి చేసి 16వ ఆర్థిక సంఘం నిధులతో.. పెద్ద ఎత్తున అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 12 కార్పొరేషన్ల తో పాటు 123 మున్సిపాలిటీలు/ నగర పంచాయతీలు ఉన్నాయి. వీటికి సంబంధించి పదవీకాలం మార్చి 17 తో ముగిసింది. ప్రస్తుతం ఆర్డీవో స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా ఉన్నారు. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో పట్టణాల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అందుకే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. వార్డుల విభజనకు సంబంధించిన ప్రక్రియ కూడా జరుగుతోంది. ఇక మండల పరిషత్ తో పాటు జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించిన గడువు జూన్ వరకు ఉంది. మండల పరిషత్ అధ్యక్షులతోపాటు జిల్లా పరిషత్ అధ్యక్షుల పదవీకాలం జూన్ తో ముగియనుంది. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పరిషత్ కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బాధ్యత జిల్లా పరిషత్ లది. అందుకే వీటి ఎన్నిక సైతం వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అనేక రకాల పిటిషన్లు కోర్టుల్లో దాఖలు అయ్యాయి. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అభ్యంతరాలు ఉన్నాయి. అయితే బీసీ గణన తర్వాత రిజర్వేషన్లపై స్పష్టత వస్తుందని ప్రభుత్వం చెప్పింది. అయితే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మాత్రం వేసవి తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే ఛాన్స్ కనిపిస్తోంది.

# గోల్డ్ డీప్ గ్యాంగ్ పనే...

కరీంనగర్, మే 9, కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలరీ షాపులో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో విచారణ వేగంగా కొనసాగుతోంది. ఈ కేసు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. చోరీ జరిగి ఐదు రోజులైనా దొంగలను పట్టుకోలేదు. కానీ కీలక ఆధారాలను మాత్రం సేకరించారు. ఈ చోరీ తర్వాత పోలీసులు, అధికార పార్టీ నేతలు, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇది పోలీసులపై మరింత ఒత్తిడి పెంచుతోంది. ఈ భారీ దోపిడీ ఒక్కసారిగా తెలంగాణ పోలీసుల అవగాహనను మార్చేసింది. కోట్ల విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లడంతో ఈ సంఘటన వెనుక బిహార్ మూలాలు కలిగిన ఆరుగురు సభ్యుల అంతర్రాష్ట్ర 'గోల్డ్ థీఫ్' గ్యాంగ్ ఉందని పోలీసులు నిర్ధారించారు.ఈ ముఠా ఉత్తరప్రదేశ్‌లో అనేక కిడ్నాపింగ్ కేసుల్లో చిక్కుకుంది. వారు ధనవంతులను లక్ష్యంగా చేసుకుని డబ్బు వసూళ్లు చేసి, బంగారు దోపిడీల వైపు మళ్లారు. బిహార్ నుంచి తెలంగాణకు వలస వచ్చిన వీరు ధర్మపురి, పెద్దపల్లి ప్రాంతాల్లో లాడ్జీలు బుక్ చేసుకుని వారం రోజులు రెక్కీ నిర్వహించారు. గ్యాంగ్ లీడర్ గతంలో జైలు శిక్ష అనుభవించాడని సమాచారం. వారి నెట్‌వర్క్ దక్షిణ భారతదేశంలో విస్తరిస్తోంది.దోపిడీ తర్వాత స్థానిక సినిమా ఫక్కీల్లో తమ ఆధారాలు వదిలి వెళ్లారు. ఇది పోలీసుల దృష్టిని స్థానికుల వైపు తిప్పడానికి వ్యూహాత్మక చర్య. ఫోరెన్సిక్ టీమ్ ఈ ఆధారాల నుంచి డీఎన్ఏ, మొబైల్ ట్రాకింగ్ ద్వారా గ్యాంగ్‌ను గుర్తించింది. ఈ టెక్నిక్ వారి సంక్లిష్ట 'రెడ్ హెర్రింగ్' వ్యూహం భాగం.కరీంనగర్ పోలీసులు, బిహార్, ఉత్తరప్రదేశ్ పోలీసులతో కోఆర్డినేట్ అవుతున్నారు. రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు. డ్రోన్‌లు, ఏఐ టూల్స్‌తో గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటికే రెండు వాహనాలు సీజ్ చేశారు. పోలీసు అధికారి ప్రకారం, 48 గంటల్లోపు అరెస్టులు జరుగుతాయి.గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి గ్యాంగ్ దోపిడీ చేసింది. దక్షిణ భారతదేశంలో బిహార్ ముఠాలు 30 శాతం పెరిగాయి. ఆర్థిక పురోగతితో జ్యువెలరీ లక్ష్యాలు ఎక్కువవుతున్నాయి.

# శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల జమ్ము కశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా, రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వారు అభిషేక సేవలో పాల్గొని, స్వామివారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రముఖుల రాకతో ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది.

# రెచ్చిపోతున్న మట్టి, మద్యం మాఫియాలు

మార్కాపురం జిల్లాలో మట్టి, మద్యం మాఫియా రెచ్చిపోతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా ఆరోపించారు.మార్కాపురం ప్రెస్ క్లబ్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మద్యం బెల్ట్ షాపులు విచ్చలవిడిగా సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అలాగే, మైనింగ్ శాఖ అధికారులు అక్రమ మట్టి తరలింపును పట్టించుకోవడం లేదని, అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శించారు.

# బీఆర్ఎస్ ఖాళీయే లక్ష్యంగా

## ఆపరేషన్ ఆకర్ష్

హైదరాబాద్, మే 9, తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా 8 స్థానాలను కైవసం చేసుకుని, ఓట్ల శాతాన్ని భారీగా పెంచుకున్న కమలదళం, ఇప్పుడు మిషన్ 2028 లక్ష్యంగా పావులు కదుపుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే కాకుండా, బీఆర్ఎస్‌ను మూడో స్థానానికి పరిమితం చేసేలా బీజేపీ అగ్రనాయకత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. పదేళ్లపాటు చక్రం తిప్పిన బీఆర్ఎస్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఓటమి తర్వాత ఆ పార్టీ నుంచి వలసలు కొనసాగుతుండగా, వాటిని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో బీజేపీ విఫలమవుతోంది. కానీ ఇప్పుడు రూటు మార్చాలనుకుంటోంది. నియోజకవర్గస్థాయి నేతలు లేకపోవడం ఆ పార్టీకి సమస్యగా మారింది.

ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, బలమైన కేడర్‌ను ఆకర్షించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని డిసైడయింది. బీఆర్ఎస్ రాజకీయ ఉనికి ముగిసింది అనే సంకేతాలను ప్రజల్లోకి బలంగా పంపడం ద్వారా, ఆ పార్టీ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకోవాలని బీజేపీ భావిస్తోంది.బీజేపీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతలుగా ఉన్న ఈటల రాజేందర్ , కేంద్ర మంత్రి బండి సంజయ్ భిన్నమైన వ్యూహాలతో పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ అంతర్గత పరిణామాలు తెలిసిన ఈటల, ఆ పార్టీలోని అసంతృప్త నేతలతో టచ్‌లో ఉంటూ ఆపరేషన్ ఆకర్ష్ ను పర్యవేక్షిస్తుండగా.. బండి సంజయ్ తనదైన శైలిలో హిందూత్వ ఎజెండా, యువతను ఆకట్టుకునేలా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. సంస్థాగతంగా బలంగా ఉన్న ప్రాంతాల్లో పట్టు నిలుపుకుంటూనే, బలహీనంగా ఉన్న దక్షిణ తెలంగాణలో పార్టీని విస్తరించడమే వీరిద్దరి ప్రధాన లక్ష్యం.రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు క్రమంగా ద్విపాక్షికంగా మారుతున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా ఉన్న పోరు, ఇప్పుడు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ గా రూపాంతరం చెందుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బలం, రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజాదరణను చూపిస్తూ.. భవిష్యత్తులో కాంగ్రెస్‌ను ఢీకొట్టే ఏకైక శక్తి బీజేపీయేనని నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఉనికిని క్రమంగా దెబ్బతీస్తూ, ఆ పార్టీకి ఉన్న ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని ఆక్రమించేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు.బీఆర్ఎస్ నుంచి వలసలు పెరగడం వల్ల ఆ పార్టీ కేడర్ చెల్లాచెదురవుతోంది. గతంలో కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన ఓటర్లు ఇప్పుడు బీఆర్ఎస్‌ను బలహీనంగా భావించి, కమలం వైపు చేరుతారని నమ్ముతున్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు బీజేపీ స్టేట్ ఆఫీస్‌కు రావడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో కలిసి ఢిల్లీలో నరేంద్ర మోదీని కలిశారు. దీంతో బీఆర్ఎస్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో సహా కమలం గూటికి చేరేందుకు రెడీ అయ్యారన్న వార్తలు వస్తున్నాయి. అయితే బీజేపీలో చేరికపై మల్లారెడ్డి కోడలు ప్రీతీరెడ్డి క్లారిటీ ఇచ్చినా..వారి కుటుంబం వేస్తున్న అడుగులు బీజేపీలో చేరేలా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు ఇదే అంశం బీఆర్ఎస్‌లోనూ చర్చకు దారి తీసిందంటున్నారు. నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, అల్లుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డి, కోడలు ప్రీతీరెడ్డి బీజేపీలో చేరబోతున్నారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి. బీజేపీ నేతలు కూడా ఈ అంశంపై నర్మగర్భంగా స్పందిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.ఇక గ్రేటర్‌లో కీలకంగా ఉన్న కాంగ్రెస్ నేతలే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర లేపేందుకు సిద్ధమయ్యారట కమలనాథులు. గ్రేటర్ పరిధిలో ఉన్న ఒక్కరిద్దరు కాంగ్రెస్ సీనియర్ నేతలను చేర్చుకునేలా పావులు కదుపుతున్నారట. జీహెచ్ఎంసీ, మల్కాజ్ గిరి కార్పొరేషన్, సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలో పాగా వేసేలా బలమైన నేతలను తమ వైపునకు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారట. నరేంద్ర మోదీ సభ వేదికగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలను బీజేపీలోకి తీసుకోవడం ద్వారా ఆ రెండు పార్టీలకు షాక్ ఇవ్వాలనే ప్లాన్ నడుస్తోందట.మోదీ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్టేట్ బీజేపీ లీడర్లు..ఇక మోదీ సభకు ముందు, ఆ తర్వాత అన్నట్టుగా పార్టీ దూకుడు పెంచాలని డిసైడ్ అయ్యారట.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బలమైన నేతలను, ఆయా పార్టీల్లో ఉన్న అసంతృప్త నేతలను ఐడెంటిఫై చేసి వారిని దశల వారీగా కమలం గూటికి చేర్చుకోవాలనేది ప్లాన్ అంటున్నారు. మరి మోదీ సభ వేదికగా బీజేపీలో చేరేదెవరో చూడాలి 2028 నాటికి తెలంగాణలో అధికారం చేపట్టడం అసాధ్యం కాదని పార్టీ గట్టి నమ్మకంతో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతున్న మాట వాస్తవం.

పార్లమెంట్ ఫలితాల జోష్‌ను అలాగే కొనసాగించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తేనే మిషన్ 2028 విజయవంతం అవుతుంది. బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా దెబ్బతీసి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ ఎంతవరకు సఫలమవుతుందనే దానిపైనే ఆ పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

# కవితకు తమిళ ఎన్నికల ఊపు



హైదరాబాద్, మే 9, భారత్ రాజకీయాల్లో తమిళనాడు ఎప్పుడూ కొత్త ట్రెండ్ సృష్టిస్తూ వస్తోంది. తాజా ఫలితాల్లో ఇది మరోసారి రుజువు చేసింది. ఇప్పుడు ఈ మార్పు దేశ రాజకీయాలను మార్చబోతోందనే చర్చ మొదలైంది. ఇప్పుడు ఇక్కడ ప్రజలు ఇచ్చిన తీర్పు ఒక రాష్ట్రానికే పరిమితం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. తమిళ ప్రజలు పంపిన ఈ సంకేతం దేశమంతటా ప్రతిధ్వనిస్తుందని అభిప్రాయపడ్డారు. తమిళనాడులో కొత్త రాజకీయ శక్తులు, ముఖ్యంగా నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే సాధిస్తున్న విజయాన్ని పరోక్షంగా కవిత ప్రస్తావించారు. దీనిపై సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని పోస్టు చేశారు. ఆమె మాటల్లో చెప్పాలంటే ఇది కేవలం ఒక ఎన్నికల ఫలితం కాదు, పాత రాజకీయ చరిత్రను తిరగరాయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. భ్రష్టు పట్టిపోయిన ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలని, కొత్త తరం నాయకత్వం, విభిన్నమైన రాజకీయ ఆలోచనలు ప్రజల ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలు పాత పద్ధతులతో ఎందుకు విసిగిపోయారని కవిత అన్నారు. కేవలం అధికారమే పరమావధిగా పని చేసే నాయకుల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని అన్నారు. వారిపై ఉన్న అసహనం కారణంగానే ప్రజలు ప్రత్యామ్నాయ శక్తులవైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను సరిదిద్దాలంటే కొత్త రాజకీయ శక్తులు రావాడం అనివార్యమని అభిప్రాయపడ్డారు.తెలంగాణలో తనదైన ముద్ర రాజకీయ ముద్ర వేయాలని చూస్తున్న కవితకు తమిళనాడు ఎన్నికల ఫలితం ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి. అందుకే రాజకీయ చరిత్రను తిరగరాయాల్సిన సమయం వచ్చిందని ఆమె చేసిన కామెంట్స్ టీఆర్ఎస్ ఆలోచనను స్పష్టం చేస్తున్నాయి. కొత్తగా పార్టీ పెట్టిన తను కొత్త ఆలోచనలతో వస్తున్నానని ప్రజలకు మంచి చేసే తమలాంటి వారిని ప్రజలు ఆదరించాలని చెబుతున్నారు. బీఆర్ఎస్‌తో విభేదించిన కవిత గత నెలలోనే టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ పెట్టారు. ఐదు ముఖ్యమైన లక్ష్యాలతో పార్టీ పెట్టినట్టు వెల్లడించారు. వాటి కోసం తాను పోరాడతానని చెప్పుకొచ్చారు. ఇప్పుడు తమిళనాడులో కూడా పార్టీ పెట్టిన రెండేళ్లలోనే ప్రజలకు చేరువైన టీవీకే మాదిరిగానే తాను కూడా ప్రజలు చేరువ అయ్యేందుకు కవిత ప్రయత్నిస్తున్నారు. అందుకే కొత్త తరం ఆలోచనలతో వస్తున్న తమ లాంటి వారికి ప్రజలు ఛాన్స్ ఇవ్వాలని సూచిస్తున్నారు. ఇదే విషయాన్ని తన సోషల్ మీడియా పోస్టు ద్వారా చెప్పుకొచ్చారు.

# కాంగ్రెస్ పార్టీలో పదవుల చిచ్చు

హైదరాబాద్, మే 9, అధికారంలోకి వచ్చిన తర్వాత పదవుల పంపకం అనేది ఏ పార్టీకైనా ఒక కత్తిమీద సాము లాంటిదే. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి, కష్టకాలంలో పార్టీ జెండా మోసిన అసలైన కార్యకర్తలకు గుర్తింపు దక్కనప్పుడు వారిలో ఆవేదన కలగడం సహజం. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో కనిపిస్తున్న ఈ పరిణామాలు చూస్తుంటే, పార్టీని గెలిపించిన 'గ్రౌండ్ లెవల్' నేతలు ఇప్పుడు తమ ఉనికి కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అర్థమవుతోంది. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత అసంతృప్తి చల్లారకముందే, ఇప్పుడు ఖమ్మం, మంచిర్యాల జిల్లాల్లో కూడా అసమ్మతి సెగలు రేగడం గమనార్హం తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో పదవుల పంపకం చిచ్చు రేపుతోంది. క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం పనిచేసిన తమను విస్మరించి, కొత్తగా వచ్చిన వారికి లేదా ఒకే వర్గానికి పెద్దపీట వేస్తున్నారని సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో రాజీనామాల పర్వం కొనసాగుతుండడం పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఖమ్మంలో రేణుకా చౌదరి వర్గం ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న రేణుకా చౌదరి వర్గం ఇప్పుడు బహిరంగంగానే తమ నిరసనను వ్యక్తం చేస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల్లో రేణుకా చౌదరి వర్గానికి చెందిన ఒక్క నేతకు కూడా పదవి దక్కకపోవడంపై ఆ వర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. 'పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పనిచేసిన మాకు గుర్తింపు ఎక్కడ?' అని వారు నిలదీస్తున్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఎమ్మెల్యే వినోద్ గెలుపునకు అహర్నిశలు శ్రమించిన సీనియర్లను కాదని, కొత్త వారికి పదవులు కట్టబెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా కాసీపేట మండలానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. ఇది పార్టీ క్యాడర్‌లో గందరగోళానికి దారితీస్తోంది. నిజమైన కార్యకర్తల ఆవేదన పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన వారు ఇప్పుడు తమను 'సెకండ్ క్లాస్' సిటిజన్స్‌లా చూస్తున్నారని భావిస్తున్నారు. పదవులన్నీ కేవలం ఒకే వర్గానికి లేదా ఒకే నాయకుడి అనుచరులకే ఎలా ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

# ఆగస్ట్ నుంచి మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభం

హైదరాబాద్, మే 9, మూసీ నది సుందరీకరణకు ముహూర్తం ఖరారైంది. ఈ ఏడాది ఆగస్ట్ నుంచి మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయి.మూసీ ప్రాజెక్టుపై చర్చించేందుకు కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ వివరాలను అధికారులు మంత్రులకు అందజేశారు. ఈ నేపథ్యంలో తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆగస్ట్ నుంచి పనులు ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.మూసీ నది సుందరీకరణ దిశగా అడుగులు పడుతున్నాయి. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టు నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమై వివిధ అంశాలపై చర్చించింది. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పరిశీలించింది. ఈ నేపథ్యంలోనే తొలిదశలో రూ.7,055 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. తొలి దశ పనులకు సంబంధించి ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుతో చర్చలు ముగిసినట్లు అధికారులు మంత్రులకు తెలియజేశారు.మరోవైపు ప్రాజెక్టు తొలిదశలో నిర్మాణాలపై ప్రభావం లేని ఐదు కిలోమీటర్ల మేరకు పనులు ప్రారంభించాలని కేబినెట్ సబ్ కమిటీ అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువగా ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. మరోవైపు ఆగస్టు నెల నుంచి పనులను ప్రారంభించి.. 2027 డిసెంబర్ నాటికల్లా పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు ప్రజా భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రాజెక్టును రూపొందించాలని అధికారులకు స్పష్టం చేసింది. ఇందుకోసం ప్రాజెక్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా చూడాలని అధికారులకు స్పష్టం చేసింది.మరోవైపు మొత్తం 55 కిలోమీటర్ల మేరకు మూసీ ప్రాజెక్టును చేపడుతున్నారు. 5 దశల్లో ఈ ప్రాజెక్టు పనులు జరగనున్నాయి. తొలి దశలో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌ల నుంచి బాపుఘాట్ వరకూ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రాజెక్టులో భాగంగా మూసీ నదిలోని చెత్తను తొలగిస్తారు. రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేపడతారు. రిటైనింగ్ వాల్స్, రెండు వైపులా రహదారులు, మురుగు కాలువలు, బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపడతారు.డిసెంబర్ 2027 నాటికల్లా ప్రాజెక్టును పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది

# హైదరాబాద్ లో నీటిగండం...

హైదరాబాద్, మే 9, ఎండ తీవ్రత ఎలా పెరుగుతుందో.. హైదరాబాద్ లో నీటి కష్టాలు కూడా అలాగే పెరుగుతున్నాయి. ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. వేసవి ఇంకా ముగియకముందే భూగర్భ జలాలు ఇంత దారుణంగా అడుగంటిపోవడం రాబోయే రోజుల్లో ఎదురయ్యే నీటి ఎద్దడికి ముందస్తు హెచ్చరికగా కనిపిస్తోంది. నగరం కాంక్రీట్ అడవిలా మారుతున్న తరుణంలో, వర్షపు నీరు భూమిలోకి ఇంకే మార్గం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందన్నది కాదనలేని వాస్తవం. హైదరాబాద్ మహానగరంలో భూగర్భ జల మట్టాలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. కేవలం ఒక్క నెలలోనే నీటి మట్టం గణనీయంగా తగ్గిపోవడం గ్రేటర్ వాసులను భయాందోళనలకు గురిచేస్తోంది. భూగర్భ జల శాఖ తాజా గణాంకాల ప్రకారం, నగరంలోని మెజారిటీ ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయే పరిస్థితి కనిపిస్తోంది. ప్రమాదకర స్థాయికి నీటి మట్టాలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిస్థితి ఇలా ఉంది. హైదరాబాద్‌లోని సుమారు 80 శాతం ప్రాంతాల్లో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే తక్కువ లోతుకు పడిపోయాయి. దీనివల్ల సాధారణ బోర్ల నుంచి నీరు రావడం కష్టతరంగా మారింది. నగర శివార్లలోని కుత్బుల్లాపూర్ ప్రాంతంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఇక్కడ భూగర్భ జలాలు ఏకంగా 32 మీటర్ల (సుమారు 105 అడుగులు) లోతుకు పడిపోయాయి. అంటే ఇక్కడ నీరు దొరకాలంటే భూమిని మరింత లోతుగా తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేగంగా మారుతున్న గణాంకాలు గతంతో పోలిస్తే ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గే వేగం పెరగడం నిపుణులను ఆశ్చర్యపరుస్తోంది. గత నెల రోజుల్లోనే పలు ప్రాంతాల్లో నీటి మట్టం సగటున 2 మీటర్ల మేర తగ్గడం గమనార్హం. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో భూగర్భంలో నీటి ఒత్తిడి పెరిగి, ఉన్న వనరులు కూడా త్వరగా హరించుకుపోతున్నాయి. దీనివల్ల ట్యాంకర్ల మీద ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. పరిష్కార మార్గాలు నీటి మట్టాలు ఇంత వేగంగా పడిపోవడానికి ప్రధాన కారణాలను అన్వేషించి పరిష్కరించుకోవాలి. నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న అపార్ట్‌మెంట్ నిర్మాణాలు, వందలాది బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు త్వరగా అయిపోతోంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఆ నీటిని భూమిలోకి ఇంకించే 'రెయిన్ వాటర్ హార్వెస్టింగ్' గుంతలు చాలా చోట్ల పనిచేయకపోవడం లేదా అసలు లేకపోవడం ప్రధాన సమస్య. నీటిని నిల్వ చేసే చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికావడంతో భూగర్భ జలాలు పునరుద్ధరణ కావడం లేదు. హైదరాబాద్‌లోని ఈ పరిస్థితి రాబోయే రోజుల్లో కేప్ టౌన్ వంటి 'డే జీరో' (నీరు పూర్తిగా అయిపోయే రోజు) పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రతి ఇంటిలో వర్షపు నీటి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం, నీటిని పొదుపుగా వాడుకోవడం ద్వారానే మన నగరాన్ని నీటి సంక్షోభం నుంచి కాపాడుకోగలం.

# పంజాబ్ నేషన్ బ్యాంక్ ఆధ్వర్యంలో వ్యవసాయ అవగాహన కార్యక్రమం

హైదరాబాద్ యూసుఫ్ గూడా లోని నిమ్స్ మీలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ వ్యవసాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. రైతులతో సంబంధాలను బలోపేతం చేయడం, వ్యవసాయ రుణాలపై అవగాహన కల్పించడం, మరియు వ్యవసాయ రంగానికి వివిధ వ్యవసాయ వ్యాపార, ఆర్థిక సహాయ కార్యక్రమాలను అందించడం అనే లక్ష్యాలతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్లో "వ్యవసాయ అవగాహన కార్యక్రమాన్ని" విజయవంతంగా నిర్వహించింది. బ్యాంకుకు చెందిన ప్రముఖులు మరియు సీనియర్ అధికారుల సమక్షంలో రిబ్బన్ కటింగ్, వ్యవసాయ అవగాహన కార్యక్రమంపై పరిచయ ప్రసంగంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం లాంఛనప్రాయంగా జ్యోతి ప్రజ్వలన జరిగింది.

ఈ కార్యక్రమానికి హైదరాబాద్ సర్కిల్ హెడ్ అరవింద్ కల్రా; సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ సుజీత్ ఝా; హైదరాబాద్ జోనల్ మేనేజర్ వందన పాండే, తదితర సీనియర్ అధికారులు హాజరై, విలువైన ప్రసంగాలు చేశారు. వ్యవసాయ వృద్ధి, గ్రామీణ శ్రేయస్సు మరియు ఆర్థిక సమ్మిళితం పట్ల బ్యాంక్ యొక్క నిబద్ధతను ప్రముఖులు నొక్కి చెప్పారు.

పంజాబ్ జాతీయ బ్యాంక్ అందించే వివిధ వ్యవసాయ ఉత్పత్తులు మరియు పథకాలపై హైదరాబాద్ సర్కిల్ కార్యాలయానికి చెందిన గణేష్ ఒక వివరణాత్మక పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ను అందించారు. ఈ సమావేశంలో రైతులు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలు మరియు అనుబంధ వ్యవసాయ కార్యకలాపాలకు మద్దతుగా రూపొందించిన ప్రత్యేక బ్యాంకింగ్ పరిష్కారాలను ప్రముఖంగా ప్రస్తావించారు.

## క్రైస్తవులకు శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలి

## పాస్టర్స్ వెల్ఫేర్ అధ్యక్షుడు డాక్టర్ పీటర్

హైదరాబాద్ నగరంలోని క్రైస్తవులకు శ్మశాన వాటికలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎన్నో ఏళ్ళుగా శ్మశాన వాటికలకు స్థలం కేటాయింపు పెండింగ్లో ఉందని సీఎం రేవంత్రెడ్డి పట్టించుకోవాలని ఖైరతాబాద్ పాస్టర్స్ ఫెల్లోషిప్ అధ్యక్షుడు డాక్టర్ బి. పీటర్ అన్నారు. శనివారం ఫిలింనగర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో చర్చిల నిర్మాణానికి, పునరుద్ధరణకు నిధులు వస్తున్నాయని, క్రైస్తవ మహిళలకు కుట్టుమిషన్లు కూడా ఇచ్చారని, ప్రతియేటా ఓవర్సీస్ స్టడీస్ కోసం 100 మంది విద్యార్థులకు ' 20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారని ఇది ఎంతో సంతోషించే విషయమని అదే విధంగా క్రైస్తవులు చనిపోయినప్పుడు ఎన్నో బాధలు పడుతున్నారని ఈ విషయాన్ని తాము ఎన్నోసార్లు గత ప్రభుత్వాలకు చెప్పినా పట్టించుకోలేదని రేవంత్రెడ్డి క్రైస్తవుల బాధను అర్థం చేసుకొని క్రైస్తవులకు శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న క్రైస్తవులకు శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని అవసరం ఎంతో ఉందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ ఫోరం అధ్యక్షులు ఆంథోని దాస్, థామస్, వీలియం, టి. ప్రభుదాస్, జీవన్, రవిపాల్, అనిల్కుమార్, సంపత్ మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజురీయింబర్స్‌మెంట్‌కు కొత్త రూల్

హైదరాబాద్, మే 9 తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌లో పేరు సరిపోలాలి.. లేదంటే దరఖాస్తు ముందుకెళ్లదు. ఈ మేరకు ఫీజుల చెల్లింపు కొత్త విధానంలో తెలంగాణ ప్రభుత్వం సంస్కరణను తీసుకొచ్చింది. తాజా నిర్ణయంతో దాదాపు 20శాతం మంది ఆధార్‌లో మార్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఒకవేళ తప్పులు ఉంటే ఈ వేసవి సెలవులు ముగిసే లోపు సరి చేసుకోవాలని సూచిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియలో కీలక సంస్కరణను తీసుకొచ్చారు. రాష్ట్రంలో విద్యార్థులు ట్యూషన్ ఫీజ్, స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో.. పదోతరగతి మెమోలో ఉన్న పేరు.. ఆధార్‌లోని పేరు, ఇంటిపేరు ఒకేలా ఉండాలని ప్రభుత్వం తెలిపింది. ఒకవేళ ఈ రెండు సరిపోలకపోతే విద్యార్థి దరఖాస్తు ప్రాసెస్ చేయరు.. అక్కడే ఆగిపోతోంది. ఈ మేరకు విద్యార్థులు పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ (పుట్టినతేదీ), ఏ సంవత్సరంలో పదోతరగతి పూర్తయ్యింది వంటి వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులకు సంబంధించి ఈ వివరాలన్నీ సరిపోలితేనే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం వస్తుంది.విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో కులం, ఉపకులం, ఆధార్ నంబరు, విద్యార్థి మొబైల్ నంబరు, యూనివర్సిటీ, జిల్లా, మండలం, కాలేజీ పేరు కూడా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాల్లో పదోతరగతి మెమోలో, ఆధార్‌లో పేరు సరిపోలితేనే దరఖాస్తు ప్రాసెస్ ప్రారంభమవుతుంది. ఇలా విద్యార్థి దరఖాస్తు చేసుకున్న తర్వాత ఓ ఐడీ వస్తుంది.. అప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు తొలివిడత పూర్తవుతుంది. అలాగే రెన్యువల్ విద్యార్థుల ఆధార్, పదోతరగతి పేరు సరిపోలాల్సిందే అంటున్నారు అధికారులు. తొలివిడతలో దరఖాస్తు పూర్తిచేసిన విద్యార్థులు మీసేవ కేంద్రాల్లో ఆధార్ ఆథెంటికేషన్ ప్రాసెస్ పూర్తిచేయాలి. అనంతరం విద్యార్థులు దరఖాస్తులో వివరాలు పూర్తిచేసి, ఆన్‌లైన్లో సమర్పించాల్సి ఉంటుంది.ప్రతి ఏటా రాష్ట్రంలో ట్యూషన్ ఫీజుల కోసం ఏటా 12 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరందరికి ప్రభుత్వం రూ.2400 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థులు గతంలో ఆధార్ ధ్రువీకరణ చేస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరయ్యేది. తెలంగాణలో జాతీయ ఉపకార వేతనాల విధానం ప్రకారం ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థులకు చెల్లిస్తున్నట్లుగా ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులకు వారి వ్యక్తిగత బ్యాంకు అకౌంట్‌లలో నేరుగా ట్యూషన్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు జమచేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.కొత్త విధానం ప్రకారం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలంటే దాదాపు 20 శాతం మంది ఆధార్‌లో పేరు సవరించుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఈ వేసవి సెలవులు ముగిసేలోగా.. ఆధార్‌లో పేర్కొన్న పేరు, ఇంటిపేరులో ఏమైనా తప్పులు ఉంటే సరిచేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యే నాటికి దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతేకాదు తప్పనిసరిగా ఆధార్ మొబైల్ అనుసంధానం చేసుకోవాలి. ఆధార్ లింక్ చేసి ఉన్న బ్యాంక్ అకౌంట్ కూడా ఉండాలి. విద్యార్థి బ్యాంక్ అకౌంట్‌లో వివరాలు, ఆధార్ నంబర్ తనిఖీ తర్వాతే ఫీజులు మంజూరు చేస్తారు. మంజూరవుతాయి.

# పొలిటికల్ గేమ్... షురూ...

# సీబీఐ భుజంపై రేవంత్ తుపాకి

హైదరాబాద్, మే 9, తెలంగాణలో ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఇంకో రెండేళ్ల తర్వాత జరగబోయే ఎలక్షన్స్ కోసం ఇప్పటినుంచే ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి పార్టీలు. సీఎం రేవంత్ రెడ్డి అయితే..బీఆర్ఎస్, బీజేపీ కంటే ఓ అడుగు ముందుకేసి..నెక్స్ట్ లెవల్ ప్లానింగ్స్ చేస్తున్నారట. రాజకీయ ప్రత్యర్థులైన బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని చెప్పేందుకు ఒక దెబ్బకు రెండు పిట్టలు అనేలా పొలిటికల్ వెపన్స్ బయటికి తీస్తున్నారట. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ అంటూ లేఖ రాసి..చర్చకు తెరలేపారు.తాము లేఖ రాసి నెలలు గడిచిపోతున్నా..ఇప్పటివరకు సీబీఐ నుంచి రెస్పాన్స్ లేదంటూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని బీఆర్ఎస్ తో కలుపుతూ విమర్శలు చేస్తున్నారు. లేటెస్ట్ గా తెలంగాణ సర్కార్ మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే..కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐకి అప్పగించిన రేవంత్ సర్కార్.. విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలంటూ సీబీఐకి అప్పగించాలని డిసైడ్ అయ్యింది. దీనిపై త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలిసి విచారణ కోరేందుకు సర్కార్ సిద్ధమవుతుండటం..తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తోంది రేవంత్ సర్కార్. గతంలోనే జస్టిస్ ఎల్.నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో కమిషన్ వేసింది. అయితే విచారణ సమయంలో కమిషన్ ఛైర్మన్ నిబంధనలకు విరుద్ధంగా..పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు కోర్టుకు వెళ్లడంతో..ఆయనను తప్పించి..జస్టిస్ లోకూర్ నేతృత్వంలో విచారణను పూర్తి చేసింది ప్రభుత్వం. ఇక ఇప్పుడు జస్టిస్ లోకూర్ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సీబీఐ విచారణ కోరాలని సీఎం రేవంత్ రెడ్డి డెసిషన్ తీసుకోవడం పొలిటికల్‌గా చర్చనీయాంశం అవుతోంది.రాజకీయ విశ్లేషణఇప్పటికే రాష్ట్రంలో రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్న కాళేశ్వరం కేసును కూడా సీబీఐకి అప్పగిస్తూ అసెంబ్లీ వేదికగా నిర్ణయాన్ని ప్రకటించింది ప్రభుత్వం. అంతేకాదు..రెండు సార్లు కేంద్రానికి లేఖ కూడా రాసింది రేవంత్ సర్కార్. కాళేశ్వరంపై సీబీఐ విచారణ కోరి 10 నెలలు గడుస్తోంది. అయినా? కేంద్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదంటోంది రాష్ట్ర ప్రభుత్వం. అయినప్పటికీ, విద్యుత్ కుంభకోణంపై రేవంత్ మళ్లీ సీబీఐనే ఎంచుకోవడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.సీబీఐ భుజంపై తుపాకి పెట్టి..బీఆర్ఎస్, బీజేపీని టార్గెట్ చేయాలన్నదే రేవంత్ ప్లాన్‌గా కనిపిస్తోంది. కాళేశ్వరంతో పాటు..విద్యుత్ కొనుగోళ్ల కేసులో..కేంద్రం సీబీఐ విచారణకు అంగీకరిస్తే..గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ చిక్కుల్లో పడుతుందని లెక్కలు వేసుకుంటున్నారట. ఒకవేళ సీబీఐ విచారణపై..కేంద్రం స్పందించకపోతే..బీజేపీ-బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం..సీక్రెట్ ఫ్రెండ్ షిప్ ఉందని ప్రజల్లోకి తీసుకెళ్లడమే రేవంత్ అసలు ప్లాన్ అంటున్నారు. దీంతో..ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా..విచారణ జరిగితే బీఆర్ఎస్ ఇరికిపోతుంది..విచారణ జరగకపోతే ప్రజల ముందు బీజేపీని దోషిగా నిలబెట్టొచ్చన్నది రేవంత్ రెడ్డి వ్యూహంగా చెబుతున్నారు.గత సర్కార్ హయాంలో అక్రమాలు, అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తూ వస్తున్న రేవంత్ ప్రభుత్వం..సాక్ష్యాధారాలతో ప్రూవ్ చేయాలనే ప్లాన్‌తో ముందుకెళ్తోందట. దీనిలో భాగంగానే..కాళేశ్వరం కమిషన్, జస్టిస్ లోకూర్ కమిషన్ రిపోర్టులను అస్త్రాలుగా మలుచుకుని కేసీఆర్ హయాంలో అక్రమాలు జరిగాయని ఎక్స్‌పోజ్ చేసే స్కెచ్ వేస్తున్నారట. మరింత వ్యూహాత్మకంగా..బాల్‌ను కేంద్రం కోర్టులోకి నెట్టి..బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనన్న ప్రచారాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా వ్యూహాన్ని ఇంప్లిమెంట్ చేస్తున్నారట. కాళేశ్వరం, కరెంట్ కొనుగోళ్లపై సీబీఐ విచారణ జరుగుతుందో..లేక పొలిటికల్ హాట్ టాపిక్‌గానే కొనసాగుతుందో చూడా

# వివాహిత అదృశ్యం



ఉప్పల్ కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యం అయింది. ఉప్పల్ పిఎస్ పరిధి ఆదర్శ్ నగర్ కాలనీకి చెందిన సారంగా జమున (36) అనే గృహిణి కనిపించకుండా పోయింది. ఈనెల 3న భర్త, పిల్లలతో జరిగిన కుటుంబ కలహాల అనంతరం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త రాముడు ఉప్పల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు వెంటనే ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

# తమిళనాడు గవర్నర్ పై కాంగ్రెస్ దుష్ప్రచారం

అమరావతి తమిళనాడు గవర్నర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. టీవీకే అధినేత విజయ్‌ని గవర్నర్ ఇబ్బంది పెడుతున్నారనడం కరెక్ట్ కాదన్నారు.మాజీ మంత్రి రోజా ప్రచారం చేయడంతోనే డీఎంకే ఓడిందనడం ఎంతో తప్పో.. ఇది కూడా అంతే తప్పని పేర్కొన్నారు.

# బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమారుడి పై పోక్సో కేసు.. తెలంగాణ రాజకీయాల్లో కలకలం

హైదరాబాద్ హైదరాబాద్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మైనర్ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫిర్యాదు ప్రకారం,17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపించారు. మొయినాబాద్ ప్రాంతంలోని ఫార్మ్ హౌస్‌తో పాటు మరో రెండు ప్రాంతాల్లో ఈ ఘటనలు జరిగినట్లు బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించినట్లు సమాచారం.ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్ సెక్షన్లు 74, 75తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11 తీ/లి 12 కింద బండి సాయి భగీరథ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.ప్రస్తుతం పోలీసులు బాధితురాలి వాంగ్మూలం,కాల్ డేటా,డిజిటల్ ఆధారాలు,మెడికల్ సంబంధిత వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.ఇక బాధితురాలి తల్లిదండ్రులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు.తమ కుమార్తెపై మానసిక ఒత్తిడి పెరగడంతో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలాగే కేసు నుంచి తప్పించుకునేందుకు తమ కూతురిపైనే తప్పుడు కేసులు పెట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.అయితే ఈ వ్యవహారంపై బండి సంజయ్ వర్గం పూర్తిగా భిన్నమైన వాదన వినిపిస్తోంది. ఇది రాజకీయ ప్రేరేపిత"హనీ ట్రాప్"వ్యవహారమని,తమ వద్ద నుంచి రూ.5 కోట్ల డిమాండ్ చేశారని చెబుతున్నారు.రాజీ ప్రయత్నాల్లో భాగంగా రూ.50 వేల రూపాయలు ఇచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతోంది.అయితే"ఎలాంటి తప్పు చేయనప్పుడు డబ్బులు ఎందుకు ఇచ్చారు?అన్న ప్రశ్న ఇప్పుడు సోషల్ మీడియాతో పాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారి తీస్తోంది.ఈ అంశంలో నిజానిజాలు పోలీసు దర్యాప్తులోనే తేలాల్సి ఉంది.ప్రస్తుతం ఈ కేసు రాజకీయంగా కూడా వేడెక్కుతోంది.అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండగా,సోషల్ మీడియాలో ఈ వ్యవహారం వైరల్‌గా మారింది.కేసు దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## కటిక చీకట్లో కారు దీపం లాంటిది కాళేశ్వరం ప్రాజెక్టు

## కాళేశ్వరాన్ని కించపరిస్తే, ముక్తేశ్వరుడి శిక్ష తప్పదు తస్మాత్ జాగ్రత్త..

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట మేడిగడ్డ మరమ్మతులు చేతగాక, తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ డ్రామాలు. 150 మీటర్లకు ఒప్పందం జరిగితే కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో తట్టెడు మట్టైనా ఎందుకు తీయలేదు, కాంగ్రెస్ మంత్రులకు ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదు..ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడుతున్నారు. పక్క రాష్ట్రాలకు బహిరంగ లేఖలు రాస్తూ రెచ్చగొట్టడం మానేసి, కేసీఆర్ లా ఆ రాష్ట్రాలను మెప్పించి తెలంగాణ ప్రయోజనాలు సాధించడం నేర్చుకోండి. ఎల్ నినో ముప్పుతో రాబోయే కరువును ఎదుర్కోవాలంటే, తక్షణమే మేడిగడ్డ పిల్లర్లకు రిపేర్లు చేసి రైతాంగానికి సాగునీరు అందించాలి. బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్. తమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని, బీఆర్ఎస్ పై చేస్తున్న దుష్ప్రచారాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ వద్ద కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గాలికి వదిలేసిందని, వచ్చే ఏడాది రాబోయే కరువును ఎదుర్కోవాలంటే మేడిగడ్డ రిపేర్లు వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు కామెంట్స్: ఆదిలాబాద్ జిల్లా తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ మంత్రుల హడావిడి చూసిన తర్వాత ఒక విషయం అర్థమవుతోంది..పని తక్కువ ప్రచారం ఎక్కువ. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు వాగుడు తప్ప చేతలు శూన్యం. ఎల్ నినో ప్రభావంతో కరువు వస్తుందని తెలిసినప్పుడు హడావిడిగా బాయి తవ్వినట్లు కాకుండా, ముందస్తుగా మేడిగడ్డ రిపేర్లు చేయాలి. కానీ దాన్ని వదిలేసి తమ్మిడిహట్టి కడుతున్నట్లు పేపర్లకు ఫోజులిస్తున్నారు. కురచ బుద్ధితో బీఆర్ఎస్ పై బురద జల్లే కార్యక్రమం తప్ప వారు చేస్తున్నది శూన్యం. 150 మీటర్ల ఎత్తులో నిర్మాణానికి ఒప్పందం జరిగిందని మంత్రి వివేక్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. ఒక మంత్రి హోదాలో ఉండి ప్రజలు ఏమనుకుంటారన్న సోయి లేకుండా ఇంత పిచ్చి అబద్ధం మాట్లాడొచ్చా. నిజంగానే ఒప్పందం ఉంటే, ఉమ్మడి రాష్ట్రంలో ఏడున్నరేండ్లు అధికారంలో ఉండి కూడా తట్టెడు మట్టైనా ఎందుకు తవ్వలేదు.

## తాతయ్యగుంట గంగమ్మ తల్లికి పట్టు వస్త్రాల సమర్పణ

### ఘనంగా నిర్వహించిన తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతర సందర్భంగా తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం భక్తిశ్రద్ధలతో, మేళతాళాల నడుమ, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆధ్యాత్మిక కోలాహలంతో తుడా ఆఫీస్ నుండి తాతయ్యగుంట గంగమ్మ తల్లి దేవాలయం వరకు ఘనంగా పాదయాత్ర నిర్వహించి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించినట్లు ఆంధ్రప్రదేశ్ సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మరియు తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ తెలిపారు.

ప్రతి సంవత్సరం ఉద్యోగుల తరపున గంగమ్మ తల్లికి సారె సమర్పించడం ఆనవాయితీగా కొనసాగుతున్నదని ఆయన పేర్కొన్నారు. తిరుపతి సంస్కృతి, ఆధ్యాత్మిక చరిత్రలో గంగమ్మ జాతరకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రజలను రక్షించేందుకు జగన్మాత గంగమ్మ అవతరించిందనే విశ్వాసం భక్తుల్లో బలంగా ఉందన్నారు.

పూర్వం తిరుపతిని పాలెగాళ్లు పాలించే కాలంలో మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడిన పాలెగాడిని సంహరించి స్త్రీజాతిని రక్షించేందుకు గంగమ్మ తల్లి అవతరించిందని భక్తులు నమ్ముతారని తెలిపారు. పాలెగాడి అహంకారాన్ని చెరిపివేసేందుకు గంగమ్మ తల్లి అనేక వేషధారణలు చేసి, చివరకు నాలుగో రోజు దొర వేషంతో దర్శనమిచ్చి అతన్ని సంహరించిందని



పురాణగాథను వివరించారు. అటువంటి పవిత్రమైన జాతరలో దొర వేషంతో పాలేగాడిని సంహరించిన నాలుగో రోజు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే భాగ్యం కలగడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని చీర్ల కిరణ్ పేర్కొన్నారు.

గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు, టీటీడీ మరియు ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా మిత్రులు, పోలీస్ సిబ్బంది సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు, అలాగే గంగమ్మ తల్లి మహాప్రసాదం (అక్షింతలు, గాజులు, పసుపు దారం, పసుపు, కుంకుమ) ను ఉద్యోగులందరికి ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని చీర్ల కిరణ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో తితిదే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్, అసోసియేట్ ప్రెసిడెంట్ మణికంఠ, కోశాధికారి గుంటూరు రేఖ, వర్కింగ్ ప్రెసిడెంట్ గంట భరత్, వైస్ ప్రెసిడెంట్ కొప్పర్తి శివ, టీటీడీ ఉద్యోగ సంఘ నాయకులు రమాదేవి, సారిక, మదన్ మోహన్, చిన్నంగారి సూరిబాబు, ఆంజనేయులు, అశోకన్, విశ్వనాథం, మదన్, వెంకటనాగులు, రమణ, శ్రీనివాస మూర్తి, చంద్ర కిరణ్, వాసన్, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, ఉమాశంకర్, సురేష్, ఈశ్వర్ నాయక్, గుణ, తేజేశ్వర్ రెడ్డి, టి. భరత్, టీటీడీ ట్రాన్స్పోర్ట్, టీటీడీ ప్రెస్, క్యాంటీన్, హెల్త్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ మహిళ ఘటన విషాదాంతం



నందిగామ ఎన్టీఆర్ జిల్లా నందిగామలో గత నెల 22వ తేదీన పుట్టింటికి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన విషాదాంతమైంది. ఈ కేసులో కాలువలో మహిళ మృతదేహం లభ్యమవడంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం.. నాగలక్ష్మి అనే మహిళ తన భర్త నరసింహారావుతో కలిసి నివసిస్తోంది. ఆమెకు ఇది రెండో వివాహం అని తెలిసింది. ఈ నెల 22న పుట్టింటికి వెళ్లిన నాగలక్ష్మి తిరిగి రాకపోవడంతో భర్త నరసింహారావు 24వ తేదీన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో శ్రీశైలం సమీపంలోని ఈగలపెంట పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. అనంతరం ఆ మృతదేహం నాగలక్ష్మిదేనని పోలీసులు గుర్తించారు.

కేసు విచారణలో నాగలక్ష్మికి రెండో పెళ్లికి ముందు ఆమె బావ గోవిందయ్యతో పరిచయం ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అత్తగారి ఇంటి నుంచి పుట్టింటికి వెళ్లిన సమయంలో నాగలక్ష్మి, గోవిందయ్య మధ్య మాట్లాడుకునే సందర్భంలో గొడవ జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు.

ఈ గొడవలో గోవిందయ్య నాగలక్ష్మి తలపై దాడి చేసి అనంతరం కాలువలో పడేసినట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి గోవిందయ్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు

### రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల: బండి సంజయ్ కుమార్

హైదరాబాద్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారంవల్లే ఆయన తండ్రి కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమయ్యారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కేటీఆర్‌ను చూసి బీఆర్ ఎస్ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రధాని రాక సందర్భంగా బండి నేతృత్వంలో ఆర్టీసీ ఎక్స్‌రోడ్ నుంచి అమీర్‌పేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కేటీఆర్ మాదిరిగా దోచుకోవడం నాకు తెలియదు. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం నాకు తెలియదు..డ్రగ్స్ తీసుకోవడం నాకు తెలియదు..కాళేశ్వరం, ఈ-ఫార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి మాకు తెలియదు..ఫాంహౌజ్ డ్రగ్స్ కేసులు మాకు తెలియదు, మంది కొంపలు ముంచడం అసలే తెలియదు, ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకునేలా చేయడం మాకు తెలియదు, మాకు ఏం తెలుసో ప్రజలు నిర్ణయిస్తారు. మీకు ఏం తెలుసో ప్రజలు గ్రహించి మిమ్మల్ని ఓడించారు అని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేటీఆర్ అధికారంలో ఉన్నప్పుడు అహంకారం చూపించి, ఇప్పుడు అధికారం పోయాక కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కాళ్లు మొక్కుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఏం చేసినా రాష్ట్రంలో ఇక అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి తాము నిధులు తెస్తుంటే కాంగ్రెస్ నేతలు తెలంగాణ సొమ్మును ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోటి దురుసుతనమే తమ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి కారణమని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ అన్నారు.



## హిడ్మా రక్షణ దళ సభ్యురాలు లక్మే లొంగుబాటు



ఏపీలో మావోయిస్టు అగ్రనేత హిడ్మా రక్షణ దళంలో పనిచేసిన పొడియం లక్మే (20) శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్గఢ్ కు చెందిన ఈమె పై రూ. లక్ష రివార్డు ఉంది. పార్టీలో వెట్టిచాకిరి, పోలీసుల గస్తీ పెరగడం, అభివృద్ధికి ఆటంకం కలిగించడం నచ్చక జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు హింసను వీడి లొంగిపోవాలని ఓఎస్డీ పంకజ్ కుమార్ కోరారు.

## కడప లో తీవ్ర ఉద్రిక్తత

కడపలోని ఆల్మస్ పేట సర్కిల్ లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇరు వర్గాలు రాళ్ళ దాడులు చేసుకున్నాయి. ఈ సర్కిల్ కు టిప్పు సుల్తాన్ సర్కిల్ గా పేరు పెట్టటం పై వివాదం ప్రారంభమయింది. సర్కిల్ కు హనుమాన్ సర్కిల్ అని పేరు పెట్టాలని మరో వర్గం డిమాండ్ చేస్తోంది. ఈ నేపధ్యంలో ఇరు వర్గాలు భారీగా మొహరించి రాళ్ళ దాడులకు దిగారు. ఘటనలో ఒక సిఐ, ఎస్సై, కానిస్టేబుల్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి. పరిస్థితి అదుపులోకి తేవటానికి పోలీసులు లాటీచార్జ్ చేసారు. ఇరు వర్గాలతో పోలీసులు చర్చలు జరుపుతున్నారు.

## మే 11న సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్



సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ సందర్భంగా మే 11వ తేదీన దేవస్థానంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు తెలియజేశారు. సోమనాథ ఆలయంపై దాడి జరిగి 1000 సంవత్సరాలు మరియు దాని పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా భారతప్రభుత్వ సాంస్కృతికశాఖ దేశవ్యాప్తంగా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరున పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర దేవదాయశాఖ ఉత్తర్వుల మేరకు మే 11వ తేదీన శ్రీశైలదేవస్థానంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లుగా వారు తెలియజేశారు. ఇందులో భాగంగానే మే 11 వ తేదీన ఉదయం గం. 7.00ల నుంచి గంగాధరమండపం వద్ద కలశయాత్ర ఉంటుందన్నారు. గంగాధరమండపం ప్రారంభమయ్యే ఈ కలశయాత్ర నందిమండపం వరకు, అక్కడి నుంచి మల్లికార్జునసదన్ మీదుగా బయలువీరభద్రస్వామి ఆలయం వరకు మరియు అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం వరకు ఈ కలశయాత్ర నిర్వహించబడుతుందన్నారు. అనంతరం పంచాక్షరీ మంత్రలేఖనానికి భక్తులకు పుస్తకాలను అందజేయడం జరుగుతుందన్నారు. తరువాత గంగాధర మండపం వద్ద గల ఏర్పాటు చేయనున్న వేదికపై గం. 10.00లకు ఎల్.ఈ.డి స్క్రీన్ నందు జాతీయ కార్యక్రమ ప్రదర్శన ఉంటుందన్నారు. కాగా సాయంకాలం గంగాధర మండపం వద్ద ఏర్పాటు చేయనున్న వేదిక వద్దనే గం.5.30ల నుంచి శివభజనలు, భక్తిరంజని కార్యక్రమాలు ఉంటాయన్నారు. తరువాత సాయంత్రం గం. 6.30లకు ఓంకారం ప్రాశస్త్యంపై ధార్మిక ప్రవచనం అనంతరం ఓంకార మంత్రజపం ఉంటుందన్నారు. కార్యక్రమం అనంతరం రాత్రి గం. 7.30ల నుంచి పేరిణి శివతాండవం ప్రదర్శన ఉంటుందన్నారు. కావున భక్తులందరు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారివారు తెలియజేశారు.

### గర్భిణీ లకు పౌష్టికాహారం పంపిణీ

### బ్రహ్మం గారి మఠం

జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం మఠాధిపతులు శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆదేశానుసారం మఠం మేనేజర్ ఈశ్వర చారి గారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు గర్భిణీ లకు పౌష్టికాహారం పులిహోర పెరుగన్నం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుల తో పాటు, నర్సులు, బ్రహ్మంగారిమఠం దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ సుపరిపాలనలో సాగునీటి వనరుల అభివృద్ధికి మహర్దశ




మైదుకూరు, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో మైదుకూరు నియోజకవర్గంలోనీ తెలుగుగంగ, కేసీ కాలువతో పాటు చిన్ననీటిపారుదల శాఖ పరిధిలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో ఆయకట్టుకు అనుగుణంగా నిధుల కేటాయింపునకు ప్రభుత్వం అనుమతి తెలిపింది.ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలుగుగంగ, కేసీ కాలువ, చిన్ననీటిపారుదల శాఖ అధికారులతో చర్చించి ఆయకట్టు పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.తెలుగుగంగ పరిధిలో 11 పనులకు రూ.136.25 లక్షలు, కేసీ కాలువ పరిధిలో 15 పనులకు రూ.89.95 లక్షలు, చిన్ననీటిపారుదల శాఖ పరిధిలో మైదుకూరు ఎర్రచెరువుతో పాటు బ్రహ్మంగారి మఠం మండలంలోని మరో 8 చెరువుల పునరుద్ధరణ పనులకు రూ.73.80 లక్షలు ఖర్చు చేయనున్నారు.కేసీ కాలువ ఆయకట్టుకు మంజూరైన నిధులకు సంబంధించి రూ.10 లక్షలలోపు పనులను సాగునీటి వినియోగదారుల సంఘాలతో, రూ.10 లక్షలు పైబడితే టెండర్ ప్రక్రియ ద్వారా చేపట్టనున్నట్లు డీఈఈ పుల్లయ్య తెలిపారు.

# మూసీలో పడిపోయిన మహిళను కాపాడిన హైడ్రా

## సమాచారం అందిన 16 నిమిషాల్లో రంగంలోకి దిగిన హైడ్రా ఆఖీఈ




హైదరాబాద్, మే 09: అంబార్పేటలోని గోల్నాక సమీపంలో మూసీలో పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను హైడ్రా కాపాడింది. ఉదయం 10.51 గంటలకు హైడ్రా కంట్రోల్ రూమ్ కు ఫోన్ రాగా.. 11.07 గంటలకు హైడ్రా బృందాలు అక్కడకు చేరుకున్నాయి. అంబర్‌పేట్ సమీపంలోని గోల్నాక, భాగ్యనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇందిర (49) శుక్రవారం రాత్రి మూసీలో పడిపోయింది. ఆ సమీపంలో ఒడ్డుకు చేరే అవకాశం లేని చోట.. చెట్లు అడ్డం ఉన్న చోట మూసీలోకి ఆమె జారి పడిపోయింది. రాత్రంతా ఆమె మూసీలోనే భయం భయంగా గడిపింది. కేకలు వేసినా ఎవరికీ వినపడలేదు. శనివారం ఉదయం 10 గంటల తర్వాత స్థానికులు గుర్తించారు. బయటకు తీయడానికి అవకాశం లేకపోవడంతో హైడ్రా కంట్రోల్ రూమ్ నంబర్ 90001 13667 కు ఫోన్ చేసి స్థానికులు సమాచారం ఇచ్చారు. స్వామి (ఆఖీఈ రెస్క్యూ ఇంచార్జి) టీమ్ 16 అంబర్‌పేట్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. హైడ్రా సహాయక చర్యలు జరుగుతుండగానే ఫైర్ సిబ్బంది కూడా అక్కడకు చేరుకున్నారు. పెద్ద నిచ్చెన సహాయంతో డీఆర్ఎఫ్ బృందం సభ్యులు కిందకు దిగి మూసీలో ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న మహిళను కాపాడారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులు, స్థానిక పోలీసులకు అప్పగించారు. పొరపాటున జారి పడిపోయినట్టు ఆమె చెప్పారు. భర్త లేదని యిద్దరి పిల్లలతో అక్కడే ఉంటున్నా అని ఆమె చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను హైడ్రా సిబ్బంది రక్షించిన తీరును స్థానికులు అభినందించారు.

# సహకార శాఖలో పారదర్శకంగా ప్రమోషన్లు, పోస్టింగులు

**- ఉద్యోగులకు సమయానికి పదోన్నతులు**

**- వారి ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**- వ్యవసాయ,సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

అమరావతి, మే 9: సహకార శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది వివిధ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా, ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులు విజయవాడలో వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు పదోన్నతులు త్వరితగతిన మంజూరు చేయడమే కాకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేసినందుకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. ప్రమోషన్లు పొందిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి ఉద్యోగులతో



ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడమే కాకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులు సానుకూల వాతావరణంలో పనిచేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని, వారి హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అలాగే సహకార శాఖలో వివిధ కేడర్ల ఉద్యోగులకు జారీ చేసిన ప్రమోషన్లలో 100 శాతం పారదర్శకత పాటించామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండేళ్లలో సహకార శాఖలో వివిధ కేడర్లలో దాదాపు 350కు పైగా ప్రమోషన్లు కల్పించబడినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ప్రమోషన్ ప్రక్రియ అమలు చేయడం వల్ల ఈ ప్రక్రియ వేగవంతమైందన్నారు. అలాగే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన ఆదేశాలతో ప్రమోషన్లు, పోస్టింగులు అత్యంత పారదర్శకంగా అమలయ్యాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి జీసీబీవీ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి. విజయ్ కుమార్, పి. రాజశేఖర్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి జి. సందీప్, సహ అధ్యక్షుడు యు. రమేష్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు వై. యేసు కుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్. భావనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మంచు మనోజ్ చేతుల మీదుగా హియ్య డైనో మండి రెస్టారెంట్ లాంచ్




హైదరాబాద్ భోజన ప్రియుల రుచిని మరింత పెంచేందుకు హియ్య డైనో మండి రెస్టారెంట్ ప్రారంభం అయింది. తాజాగా కూకట్ పల్లిలోని జీపీఆర్ మల్టీప్లెక్స్ ఫస్ట్ ఫ్లోర్ లో హియ్య డైనో మండి రెస్టారెంట్ గ్రాండ్ లాంచ్ ఈవెంట్ జరిగింది. హీరో మంచు మనోజ్ చేతుల మీదుగా ఈ రెస్టారెంట్ ఘనంగా ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో హీరో మంచు మనోజ్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, యాంకర్ సుమ కనకాల, గౌతమి చౌదరి, గౌతమ్, విక్రాంత్, రాజేష్, భావన, ఇన్ ఫ్ల్యుయోన్సర్స్, సెలబ్రెటీలు, ప్రముఖులు పాల్గొన్నారు.

సుమా కనకాల మాట్లాడుతూ.. ఇప్పటికే హియ్య మండి చాలా పాపులర్.. ఇప్పుడు డైనో అనే మరో కాంబినేషన్ తో రావడం బాగుందన్నారు. ఫుడ్ తో పాటు యాంబియెన్స్ బాగుంటేనే జనాలు వస్తున్నారు. ఈ విషయంలో హియ్య డైనో మండి రెస్టారెంట్ సక్సెస్ అయిందన్నారు. ఒక డైనోసర్ సెటప్ లో ఈ మండి ఉండడం చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ఈ మండికి వచ్చే భోజన ప్రియులు ఈ యాంబియెన్స్ చూసి ఆశ్చర్యపోతారు అని తెలిపారు. ముఖ్యంగా కుటుంబంతో సహా వచ్చే వారికి, చిన్న పిల్లలకు ఈ రెస్టారెంట్ చాలా బాగా నచ్చుతుందన్నారు. ఒక సారి వస్తే మళ్లీ మళ్లీ రావాలనిపిస్తుది అనే తెలిపారు. ఇలాంటి అద్భుతమైన రెస్టారెంట్ ను మొదలు పెట్టిన గౌతమి చౌదరి, గౌతమ్, విక్రాంత్ లకు శుభాకాంక్షలు తెలిపారు.

మంచు మనోజ్ మాట్లాడుతూ.. గౌతమి చౌదరి, గౌతమ్, విక్రాంత్ ఫ్రెండ్స్. ఈ ఫ్రెండ్స్ కలిసి మొదలు పెట్టిన ఈ రెస్టారెంట్ ప్రారంభించడం చాలా బాగుందన్నారు. ఇలాంటి క్రియేటీవ్ ఆలోచనలతో రెస్టారెంట్ పెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు, ఫ్యామిలీలకు బాగా నచ్చుతుందని అన్నారు. కచ్చితంగా హైదరాబాద్ లో ఉన్న వారు హియ్య డైనో మండిని ఒకసారి ట్రై చేయమని తెలిపారు.

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ.. కొత్త కాన్సెప్ట్ లో హియ్య డైనో మండిని స్థాపించడం చాలా సంతోషంగా ఉందన్నారు. హోటల్ రంగంలో రాణించడం అంటే చాలా ఓపిక ఉండాలి. హియ్య రెస్టారెంటులు వైజాగ్, నాగపూర్, మాదాపూర్, ఇప్పుడు కూకట్ పల్లిలో స్థాపించడం, విజయంతో ముందుకు వెళ్లడం అంటే మంచి విషయం అని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు ఎంజయ్ చేసే విధంగా, కుటుంబాలు కూడా ఆహ్లాదకరంగా ఉండేలా ఇలాంటి వాతావరణంలో రెస్టారెంట్ ను ప్రారంభించడం బాగుందన్నారు. కేవలం బిజినెస్ చేయడమే కాదు వందల మందికి ఉపాది కల్పిస్తున్న హియ్య టీమ్ కు శుభాకాంక్షలు తెలిపారు.

గౌతమి చౌదరి మాట్లాడుతూ.. హియ్య డైనో రెస్టారెంట్ ఓపెనింగ్ కు వచ్చిన సుమా, మంచు మనోజ్, అరికెపూడి గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. పిల్లలను, ఫ్యామిలీలకు మంచి వాతావరణంలో మంచి భోజనం అందించాలనే ఆలోచన నుంచి పుట్టిందే ఈ డైనో మండి అని చెప్పారు. త్వరలోనే అమిర్ పేట్ లో హియ్య స్పేస్ మండిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇక హియ్య మండి పార్టనర్స్ కూడా చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. గౌతమ్ మాట్లాడుతూ.. చాలా సంతోషంగా ఉందన్నారు. పిలువగానే వచ్చినందుకు మంచు మనోజ్, అరికెపూడి గాంధీ, సుమకు థ్యాంక్స్ చెప్పారు. హియ్య మండిలను ఆదరిస్తున్న జనాలకు థ్యాంక్స్ చెప్పారు. మంచి రెస్పాన్స్ వస్తుందని తెలియజేశారు. ఫుడ్ బిజినెస్ అంటే కేవలం డబ్బులు సంపాదించడమే లక్ష్యం కాదు, రుచికరమైన ఆహారాన్ని అందించడమే మా లక్ష్యమని చెప్పారు.

విక్రాంత్ మాట్లాడుతూ.. హియ్య మండి బ్రాంచేస్ ఎక్కడ పెట్టినా అద్భుతమైన స్పందన వస్తుందని అందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. కేవలం మూడు నెలలలో మరో మండిని ఓపెన్ చేయడం అంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# రౌడీ జనార్ధన" మూవీ నుంచి విజయ్ దేవరకొండ బర్త్ డే పోస్టర్



స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో నటిస్తున్న క్రేజీ మూవీ “రౌడీ జనార్ధన”. స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా “రౌడీ జనార్ధన” సినిమా రూపొందుతోంది.

ఈ రోజు హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విశెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు “రౌడీ జనార్ధన” మూవీ మేకర్స్. ఈ బర్త్ డే పోస్టర్ లో వర్షంలో తడుస్తూ చేతిలో పిస్టల్ తో ఉన్న విజయ్ స్టిల్ ఆకట్టుకుంటోంది. ఆయన ఛాతీపై హీరోయిన్ కీర్తి సురేష్ కాలు పెట్టినట్లు చూపించడం ఆసక్తి కలిగిస్తోంది. ఈ పోస్టర్ యాక్షన్ తో పాటు రొమాంటిక్ యాంగిల్ ను ఎస్టాబ్లిష్ చేస్తోంది. “రౌడీ జనార్ధన” సినిమాను సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు రౌడీ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ వెయిట్ చేస్తున్నారు. ఈ డిసెంబర్ లో ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

నటీనటులు - విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్, తదితరులు

# సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారురాలి ఇంటికే అందజేసిన బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



బద్వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి పేదవాడి పెన్నిధి అని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శనివారం కాశినాయన మండలం ఉప్పులూరు గ్రామంలో అనారోగ్యంతో చికిత్స పొంది మృతి చెందిన లక్ష్మీ ప్రసన్న కుమారుడు కి మంజూరైన రూ.66,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును నేరుగా ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా విజయమ్మ మాట్లాడుతూ.. గతంలో చెక్కుల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితికి భిన్నంగా నేడు పారదర్శక పాలనతో లబ్ధిదారుల ఇంటికే సాయం చేరుతోందన్నారు. ఆరోగ్యశ్రీలో కవర్ కాని కేసులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా తక్షణ సాయం అందిస్తున్నామని, ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ గురువి రెడ్డి, మాజీ ఎంపీటీసీ పోలిరెడ్డి, టీడీపీ నేతలు విజయ్ కుమార్ రెడ్డి, దుగ్గిరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 11 వ తేదీ నుండి విద్యా వారోత్సవాలు



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: హైదరాబాద్, మే 9: 99 రోజుల ప్రజా పాలన్ ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుండి నిర్వహించేంచే విద్యా శాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణపై సంబంధిత ఉన్నతాధికారులతో కలసి జిల్లా కలెక్టర్లతో నేడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు.




ఈ సందర్భంగా కలెక్టర్లతో సి ఎస్ మాట్లాడుతూ ఈ నెల 11 న ఎల్ బి స్టేడియం లో నిర్వహించనున్న విద్యావారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు బారి సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు చొరవతీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు . విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వారోత్సవాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను , రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్లకు విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ కి సంబంధించిన పురోగతి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, జనాభా స్వీయ గణన కు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సి ఎస్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియొ కాన్ఫరెన్స్ లో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా , కళాశాల విద్యా శాఖ కమీషనర్ దేవసేన, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ , పౌర సరఫరాల శాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్రతదితరులు పాల్గొన్నారు.



# టీటీడీ ఆగస్టు నెల దర్శన కోటా విడుదల వివరాలు

కడప ఆగస్టు నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరా లను టీటీడీ ప్రజా సంబంధాల ముఖ్య అధికారి విడుదల చేసిన వాటిలో ఈ విధంగా ఉన్నాయి.తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల( సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను మే 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.ఈ టికెట్లు పొందిన వారు 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి.21న ఆర్జిత సేవా టికెట్ల విడుదలకల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్ లైన్ లో విడుదల చేయనుంది. అదే విధంగా వార్షిక పవిత్రోత్సవాల (23-08-26 నుండి 25-08-26) టికెట్లను కూడా మే 21 ఉదయం 10గం. ఆన్లైన్ లో విడుదల చేయనున్నారు.వర్చువల్ సేవల కోటా విడుదలవర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.23న అంగ ప్రదక్షిణ టోకెన్లు విడుదలఅంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు.శ్రీవాణి దర్శన కోటా విడుదలశ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా?వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదలప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల?తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 25న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.ష్ట్రబిబిజూబ://బిబిటవలజీబబిష్ట్రజీనిజీఎబ.జీజూ.ఐనీల.తిని వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

# 2 సీట్ల పార్టీ - విజయ్‌కు వీసీకే గండం !

చెన్నై మే 9, (న్యూస్ పల్స్) తమిళనాడు రాజకీయం ప్రస్తుతం విడుతలై చిరుతైగల్ కట్చి అధినేత తోల్ తిరుమావళవన్ చుట్టూ తిరుగుతోంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం పార్టీతో పొత్తు విషయమై తిరుమావళవన్ అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. విజయ్‌కు మద్దతు ఇచ్చే విషయంలో ఆయన ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడమే కాకుండా, తెర వెనుక భారీ షరతులు విధిస్తున్నారరు. దీంతో విజయ్ రాజకీయ ప్రయాణానికి ఆరంభంలోనే గట్టి సవాళ్లు ఎదురవుతున్నాయి.పొత్తులో భాగంగా వీసీకే అధినేత అత్యంత కీలకమైన డిప్యూటీ సీఎం పదవిని కోరుతున్నట్లు సమాచారం. కేవలం సీట్ల సర్దుబాటుతో సరిపెట్టుకోకుండా, అధికారంలో సమాన వాటా ఉండాలని ఆయన పట్టుబడుతున్నారు. దశాబ్దాలుగా ద్రావిడ పార్టీల నీడలో ఉన్నా దక్కని గౌరవం, విజయ్ పార్టీ ద్వారా సాధించుకోవాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది. ఒకవేళ పొత్తు కుదిరితే ప్రభుత్వంలో వీసీకేకు కీలక ప్రాతినిధ్యం ఉండాలనే షరతుపై ఆయన వెనక్కి తగ్గడం లేదని చెబుతున్నారు. మరోవైపు నియోజకవర్గాల విషయంలోనూ తిరుమావళవన్ పట్టు విడవడం లేదు. ముఖ్యంగా తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాన్ని తన పార్టీకి కేటాయించాలని ఆయన డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ స్థానం నుంచి విజయ్ గెలిచారు. రాజీనామా చేస్తున్నారు. ఆ స్థానాన్ని పొందడం ద్వారా అసెంబ్లీలో తన పార్టీ బలాన్ని పెంచుకోవాలని ఆయన యోచిస్తున్నారు. కేవలం రెండు సీట్లు ఉన్న పార్టీకి ఉప ముఖ్యమంత్రి వంటి కీలక పదవులపై హామీ ఇవ్వడం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని విజయ్ సన్నిహితులు భావిస్తున్నారు. సీఎం పదవి కోసం.. విజయ్ రాజీపడ్డారన్నప్రచారంజరుగుతోంది. మొత్తానికి తమిళనాడు రాజకీయాల్లో సీనియర్ నేత తిరుమావళవన్ తన అనుభవంతో యువ నేత విజయ్‌కు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. అటు డీఎంకే, ఇటు టీవీకేల మధ్య దోబూచులాడుతూ తన పార్టీ ప్రయోజనాలే పరమావధిగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఇవాళ ఆయన తన మద్దతు ఎవరికో ప్రకటించే అవకాశం ఉంది. విజయ్ తన డిమాండ్లకు అంగీకరిస్తే ఆయన మద్దతు లేఖ గవర్నర్ కు ఇస్తారు. లేకపోతే.. ఆయన నిర్ణయాన్ని వాయిదా వేసుకునే అవకాశం ఉంది.

# భారత త్రివిధ దళాల నూతన అధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి

న్యూఢిల్లీ మే 9, (న్యూస్ పల్స్)దేశ రక్షణ రంగంలో అత్యున్నత పదవి అయిన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గా లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) ఎన్.ఎస్. రాజా సుబ్రమణి నియమితులయ్యారు. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఈ నెల 30న పదవీ విరమణ చేయనుండటంతో, ఆయన స్థానంలో సుబ్రమణి బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోవల్ నేతృత్వంలోని నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ లో సైనిక సలహాదారుగా పనిచేస్తున్న ఆయన, ఈ నియామకంతో పాటు మిలిటరీ అఫైర్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా కూడా వ్యవహరిస్తారు.

వరుసగా మూడవసారి కూడా సీడీఎస్ పదవి ఆర్మీ విభాగానికే దక్కింది.దాదాపు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సైనిక అనుభవం కలిగిన రాజా సుబ్రమణి, భారత సైన్యంలో అనేక కీలక బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించారు. 1985లో గర్వాల్ రైఫిల్స్‌లో కమిషన్ పొందిన ఆయన, అస్సాంలో ఉగ్రవాద వ్యతిరేక పోరాటాల్లో 16 గర్వాల్ రైఫిల్స్ విభాగానికి నాయకత్వం వహించారు. పశ్చిమ సరిహద్దులో భారత సైన్యానికి చెందిన అత్యంత కీలకమైన స్ట్రైక్ కోర్ కమాండర్‌గా, ఆర్మీ వైస్ చీఫ్‌గా , సెంట్రల్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా ఆయన సేవలు అందించారు.

సరిహద్దుల్లో వ్యూహాత్మక సవాళ్లు ఎదురవుతున్న తరుణంలో ఆయన అనుభవం దేశానికి ఎంతో కీలకం కానుంది.నూతన సీడీఎస్ ముందు ప్రస్తుతం అనేక సవాళ్లు వేచి ఉన్నాయి. ముఖ్యంగా ఆర్మీ, నేవీ , ఎయిర్ ఫోర్స్ విభాగాలను ఏకీకృతం చేస్తూ థియేటర్ కమాండ్స్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉంది. దీనితో పాటు, ఐరోపా , పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధాల కారణగా మారుతున్న యుద్ధ తంత్రాలకు అనుగుణంగా భారత సాయుధ దళాలను ఆధునీకరించడం, అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం వంటి అంశాలపై ఆయన ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంటుంది.

ఎన్ఎస్సీఎస్ నుంచి సీడీఎస్ పదవికి ఎంపిక కావడం ద్వారా వ్యూహాత్మక నిర్ణయాల్లో ఆయనకు ఉన్న పట్టు రక్షణ రంగానికి అదనపు బలం కానుంది.మరోవైపు, భారత నౌకాదళానికి కూడా నూతన సారథిని ప్రభుత్వం ఖరారు చేసింది. వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ తదుపరి నేవీ చీఫ్ గా నియమితులయ్యారు. ప్రస్తుతం నేవీ వైస్ చీఫ్‌గా పనిచేస్తున్న ఆయన, మే 31న రిటైర్ కానున్న అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. కమ్యూనికేషన్ , ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ నిపుణుడైన స్వామినాథన్, గతంలో ఐఎన్ఎస్ విక్రమాదిత్య యుద్ధనౌకకు , వెస్ట్రన్ ఫ్లీట్‌కు కమాండర్‌గా పనిచేశారు. రక్షణ రంగంలోని ఈ కీలక మార్పులతో భారత భద్రతా వ్యవస్థ మరింత పటిష్టం కానుంది. అజిత్ డోవల్, రాజా సుబ్రమణి మధ్య ఉన్న అనుబంధం కేవలం ఉన్నతాధికారుల మధ్య ఉండే సంబంధం మాత్రమే కాదు.

అది జాతీయ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక బంధం. జాతీయ భద్రతా సలహాదారు గా డోవల్ దేశ రక్షణ వ్యూహాలను రచిస్తుంటే, ఆయన కార్యాలయంలో సైనిక సలహాదారుగా ఉన్న సుబ్రమణి ఆ వ్యూహాలకు సైనిక రూపాన్ని ఇస్తూ అత్యంత సన్నిహితంగా పనిచేశారు. గత సీడీఎస్ అనిల్ చౌహాన్ తరహాలోనే, డోవల్ పర్యవేక్షణలో దేశ భద్రతా సవాళ్లపై పూర్తి పట్టు సాధించిన వ్యక్తి కావడం వల్లే రాజా సుబ్రమణికి ఈ అత్యున్నత పదవి దక్కింది.

కీలకమైన భద్రతా నిర్ణయాల్లో డోవల్ నమ్మకస్తుడైన సలహాదారుగా గుర్తింపు పొందడమే సుబ్రమణి నియామకానికి ప్రధాన కారణమైంది.

# ప్రధాని షెడ్యూల్ ఇదే

హైదరాబాద్, మే 9, ప్రధానమంత్రి మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తెలంగాణ వస్తున్నారు. దీని కోసం తెలంగాణ బీజేపీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ పర్యటన రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కీలకమైన మలుపుగా భావిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత పూర్తి ఉత్సాహంతో ఉన్న భారతీయ జనతా పార్టీ శ్రేణులు, ప్రధాని రాకకు పురస్కరించుకొని భారీ ఏర్పాట్లు చేశాయి. ఈ పర్యటన కేవలం రాజకీయ ప్రాధాన్యత కలిగింది. సుమారు 8వేల కోట్ల విలువైన అభివృద్ధి ఫలాలను తెలంగాణ ప్రజలకు అందించే లక్ష్యంతో సాగుతుంది. ప్రధాని మోదీ ఈ పర్యటనలో భాగంగా వివిధ కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇవి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలను కల్పించే అవకాశం ఉంది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ వద్ద 2,360 కోట్లతో అభివృద్ధి చేయనున్న ఈ స్మార్ట్ సిటీకి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇది పారిశ్రామిక రంగంలో తెలంగాణకు కొత్త దిశకు చూపించనుంది. 3175 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న గూడెబెల్లూరు మహబూబ్‌నగర్ జాతీయ రహదారి పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేయనున్నారు. 611 కోట్లతో మల్లాపూర్ వద్ద ఏర్పాటు చేయనున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్‌కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. 1243 కోట్లతో పూర్తి చేసిన కాజీపేట-విజయవాడ ట్రిపులింగ్ పనులకు ప్రధాని జాతీకి అంకితం చేస్తారు.వరంగల్ జిల్లలో 200 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ టెక్స్ టైల్ పార్క్ తెలంగాణ చేనేత, వస్త్ర రంగానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడానికి సహాయపడుతుంది.

ప్రధాని మోడీ ఆదివారం మధ్యాహ్నం తెలంగాణకు చేరుకోనున్నారు. ఆయన పర్యటన అత్యంత పకడ్బందీగా సాగేలా అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. మధ్యాహ్నం 2.50 గంటలకు కర్ణాటక నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్ పోర్ట్ చేరుకుంటారు. హెలీకాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3.30 గంటలకు హెచ్ఐసీసీకి చేరుకొని అక్కడ 8000కోట్ల విలువై వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. సాయంత్రం 4.10 నిమిషాలకు హైటెక్ సిటీ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన సింధూ ఆసుపత్రిని ప్రారంభిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకని బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో గుజరాత్‌లో జామ్‌నగర్‌కు బయల్దేరారు. ప్రధాని పర్యటన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు

# కడపలో టిప్పు సుల్తాన్ విగ్రహ వివాదం

కడప, మే 9,కడప నగరంలోని ఆల్మాస్ పేట సర్కిల్ పేరు మార్పు వ్యవహారం శనివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ సర్కిల్‌ను టిప్పు సుల్తాన్ సర్కిల్ గా మార్చాలని ఒక వర్గం ప్రయత్నించగా, దానిని మరో వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ వివాదంతో ఆల్మాస్ పేట ప్రాంతం ఒక్కసారిగా రణరంగంగా మారింది. ఇరువర్గాల మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని పోటాపోటీగా ఆందోళనలు చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఈ వివాదానికి ప్రధాన కారణం సర్కిల్ నామకరణం. ఆల్మాస్ పేట సర్కిల్‌కు టిప్పు సుల్తాన్ పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్న వారు, దానిని హనుమాన్ సర్కిల్ గా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, టిప్పు సుల్తాన్ పేరునే కొనసాగించాలని మరికొందరు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాటలు జరగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకుంటూ ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత దాడుల స్థాయికి చేరింది. సమాచారం అందిన వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలను ఆల్మాస్ పేట సర్కిల్ వద్ద మోహరించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. నిరసనకారులను అదుపులోకి తీసుకుని శాంతిభద్రతలను కాపాడటానికి పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ, ముందస్తు జాగ్రత్తగా పోలీసులు పికెటింగ్‌ను కొనసాగిస్తున్నారు.ఈ వివాదంపై రాజకీయ ప్రకంపనలు కూడా మొదలయ్యాయి. భారతీయ జనతా పార్టీ (ఃఏఖ) , ఇతర హిందూ సంఘాలు టిప్పు సుల్తాన్ పేరు పెట్టడాన్ని మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. టిప్పు సుల్తాన్ హిందూ వ్యతిరేక పాలకుడని, అటువంటి వ్యక్తి పేరును ప్రజా ప్రదేశాలకు పెట్టడం సరికాదని వారు వాదిస్తున్నారు.

మరోవైపు, టిప్పు సుల్తాన్ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన దేశభక్తుడని ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. ఈ మతపరమైన, రాజకీయ వివాదం కడప నగరంలో చర్చనీయాంశంగా మారింది ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కొందరు కావాలని ఇటువంటి వివాదాలను తెరపైకి తెస్తున్నారని సామాజిక కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. శాంతియుత వాతావరణం నెలకొనేలా ఇరువర్గాల పెద్దలతో చర్చలు జరిపి, త్వరలోనే ఒక పరిష్కారానికి రావాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ప్రజలు ఎటువంటి రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దని, శాంతిని కాపాడాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# విజయ్ కు సంఖ్యాబలం,కత్తిమీద సాము...

చెన్నై, మే 9, తమిళనాడు రాజకీయాల్లో విజయ్ తన తమిళగ వెట్రి కళగం ద్వారా కోట్లాది మంది అభిమానుల ఆశలను మోస్తూ ముఖ్యమంత్రి పీఠం దిశగా అడుగులు వేశారు. అయితే, ఈ పట్టాభిషేకం పూలబాట కాదు.. ముళ్లబాట . దశాబ్దాల ద్రవిడ రాజకీయాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత క్లిష్టమైన, అస్థిరమైన సమీకరణాల మధ్య విజయ్ బాధ్యతలు చేపట్టబోతున్నారు. 118 మంది ఎమ్మెల్యేల మద్దతుతో మేజిక్ ఫిగర్‌ను అతి కష్టమ్మీద చేరుకున్న విజయ్ సర్కార్‌కు దినదినగండం.. నూరేళ్ల ఆయుష్షు అన్న సామెత అక్షరాలా సరిపోతుంది.విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఉన్న ప్రధాన బలహీనత సంఖ్యాబలం . మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం ఒకటి లేదా రెండు స్థానాల దూరంలోనే నిలబడటం అంటే, ఐదేళ్ల కాలం పాటు ప్రతి నిమిషం గండం గడిచినట్లే. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలం ప్రాణవాయువు వంటిది. ఒకరిద్దరు ఎమ్మెల్యేలు అలిగినా, లేదా అసంతృప్తితో రాజీనామా చేసినా ప్రభుత్వం కుప్పకూలే ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ ఒక స్వతంత్ర అభ్యర్థి లేదా చిన్న పార్టీ నేత కూడా కింగ్ మేకర్ పాత్ర పోషించే అవకాశం ఉండటంతో, వారిని బుజ్జగించడానికే విజయ్ తన శక్తిని ఎక్కువగా ఖర్చు చేయాల్సి ఉంటుంది.విజయ్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకేలు ఇప్పటికీ డీఎంకే కూటమిలో అంతర్భాగమేనన్నది జగమెరిగిన సత్యం. స్టాలిన్ మౌన సమ్మతి తోనే ఈ మద్దతు లభించినట్లు స్పష్టమవుతోంది.

దీనివల్ల విజయ్ ప్రభుత్వం మనుగడ సాగించాలంటే ప్రతి నిర్ణయంలోనూ మిత్రపక్షాల ఆశయాలకంటే, వారిని నడిపిస్తున్న అదృశ్య హస్తం వ్యూహాలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. తన సొంత రాజకీయ ఎజెండాను అమలు చేయాలనుకున్నప్పుడు మిత్రపక్షాల నుంచి వ్యతిరేకత వస్తే, దానిని ఎదుర్కోవడం విజయ్‌కు అగ్నిపరీక్షే.సినిమాల్లో హీరోగా విలన్లను చిటికెలో మట్టికరిపించడం సులభం, కానీ రాజకీయాల్లో అసలైన విలన్లు వ్యవస్థలోని లొసుగులు , ప్రతిపక్షాల వ్యూహాలు. విజయ్‌కు పరిపాలనా అనుభవం శూన్యం. ఒక సుస్థిరమైన బహుమతం లేని ప్రభుత్వంపై ఐఏఎస్ అధికారులు, సీనియర్ రాజకీయ నాయకులు పెత్తనం చెలాయించే అవకాశం ఉంది. సంకీర్ణ ప్రభుత్వంలో శాఖల కేటాయింపు నుంచి నిధుల విడుదల వరకు ప్రతి అడుగులోనూ మిత్రపక్షాల ఒత్తిడి ఉంటుంది. ఈ ఒత్తిళ్లను తట్టుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం విజయ్‌కు సాధ్యమేనా అన్నది అసలు ప్రశ్న.తమిళనాడులో అన్నాడీఎంకే, డీఎంకే వంటి బలమైన ప్రతిపక్షాలు ఉన్నాయి. ఏ చిన్న అవకాశం దొరికినా ఈ చిన్నపాటి మెజార్టీ ఉన్న ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అవి వెనుకాడవు. అసంతృప్త ఎమ్మెల్యేలను ఆకర్షించడం ద్వారా ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు శక్తులు నిరంతరం కాచుకుని ఉంటాయి. ఈ వేట నుంచి తన ఎమ్మెల్యేలను కాపాడుకోవడం విజయ్‌కు నిత్యకృత్యంగా మారనుంది. రాజకీయాలు అంటే కేవలం గెలవడం మాత్రమే కాదు, గెలిచిన పీఠాన్ని కాపాడుకోవడం కూడా. విజయ్ ముందున్నది ఐదేళ్ల సుదీర్ఘ ప్రయాణం. ఆయన కేవలం ఒక నటుడు అనే ముద్రను చెరిపేసి, ఒక ముదురు రాజకీయవేత్త గా మారాల్సి ఉంటుంది. మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ, ప్రతిపక్షాల ఎత్తులను చిత్తు చేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ఆయనకు అసాధారణమైన సహనం, వ్యూహాత్మక చతురత అవసరం. విజయ్ ఈ రాజకీయ చదరంగంలో రాజ గా నిలుస్తారా లేక కేవలం ఒక పావు గా మిగిలిపోతారా అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, విజయ్ సర్కార్ ప్రయాణం మాత్రం ఉత్కంఠభరితంగా ఉండబోతోంది.

# ఒంటికి నిప్పంటించుకున్న టీవీకే కార్యకర్త

చెన్నై తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం జరుగుతుండటంతో మనస్తాపం చెందిన టీవీకే కార్యకర్త కిరోసిన్ పోసుకుని ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. తిరునెల్వేలి జిల్లాలోని సెట్టికుళం సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అక్కడున్న వారు మంటలార్పి అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కన్యాకుమారి వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని ఇసక్కియప్పన్ అనే వ్యక్తిగా గుర్తించారు. అతడు పుతుమనై గ్రామ టీవీకే కార్యదర్శిగా పనిచేస్తున్నాడు.

# మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య కు ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకటించాలి.. రంజిత్




**కూకట్పల్లి (ప్రజాబలం )మే 09** :ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత మర్చిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందా అని మాల మహానాడు తీవ్రంగా ప్రశ్నిస్తోంది.ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టంగా ఎస్సీ మాల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పటికే 11 కార్పొరేషన్లు ప్రకటించినప్పటికీ మాల కార్పొరేషన్‌ను మాత్రం కావాలనే పక్కన పెట్టడం దళితుల పట్ల ఉన్న వివక్షకు నిదర్శనం మాలల ఓట్లు కావాలి కానీ మాలల హక్కులు మాత్రం వద్దా ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లో ఒక్క దళితుడికి కూడా స్థానం ఇవ్వకపోవడం అత్యంత అవమానకరం ఈ రాష్ట్రంలో చదువుకున్న దళిత మేధావులు లేరా ఉద్యమాలు చేసిన నాయకులు పనికిరారా లేక దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తున్నారా 30 సంవత్సరాలుగా మాల జాతి కోసం ప్రజల్లో ఉంటూ నిరంతరం పోరాటం చేస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య పేరును వెంటనే ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకటించాలి. దళితుల ఆత్మగౌరవంతో ఆటలు ఆడితే ప్రభుత్వం రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.ఎన్నికల హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు మాల సమాజం సిద్ధంగా ఉందని హెచ్చరిస్తున్నాము. మాల కార్పొరేషన్‌ను వెంటనే ప్రకటించాలి దళితులకు రాజకీయ, సామాజిక న్యాయం చేయాలి

# పదో తరగతి పరీక్షలో స్కూల్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన పట్కారి సహస్ర...



పదవ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన పట్కారి సహస్రకు చిన్నారులతో సన్మానం మెహిదీపట్నం గుడిమల్కాపూర్ లో న్యూ ఎడెన్ స్కూల్లో 10.వ తరగతి చదువుతున్న సహస్ర 600 మార్కులకు 575 మార్కులు ఉత్తీర్ణత సాధించి స్కూల్ ఫస్ట్ ర్యాంక్ వచ్చింది స్కూల్ యాజమాన్యం సహస్రకు అభినందనలు తెలియజేశారు అనంతరం సహస్ర మాట్లాడుతూ కష్టపడి చదివితే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదని సహస్ర అన్నారు కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల పేరు కూడా నిలబెట్టాలని సహస్ర తెలిపారు స్కూల్ ఫస్ట్ ర్యాంకు రావడంతో పట్కారి సహస్ర తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు

# 17 న వాక్ ఫర్ వాటర్




**రాజేంద్రనగర్ నియోజక వర్గం ప్రజాబలం ప్రతినిధి 9 మే 2026**మణికొండ మరియు నెక్నంపూర్ మున్సిపల్ డివిజన్లలో దిన దినం భూగర్భ జలాలు తీవ్రంగా తగ్గి పోవడం, జలమండలి ద్వారా పైప్ లైన్ తాగునీటి సరఫరా కూడా తీవ్ర కొరతకు గురవుతున్న నేపథ్యంలో, బీ.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి నాయకత్వంలో "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమాన్ని 17 మే 2026 ఆదివారం రోజున సాయంత్రం 4:30 గంటలకు నెక్నంపూర్ చింత చెట్టు బటర్ ఫ్లై కూడలి నుండి మర్రిచెట్టు కూడలి లోని జలమండలి కార్యాలయం వరకు శాంతి యుత "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ దరిమిలా వాక్ ఫర్ వాటర్ పోస్టర్‌ను విడుదల చేయడం జరిగింది. నీరు మన దైనందిన జీవితానికి అత్యంత అవసరమైన వనరు. నీరు లేకుండా జీవనం అసాధ్యం. అందువల్ల రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు – ముఖ్యంగా భారీ నీటి బిల్లులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, మహిళలు, మణికొండ మరియు నెక్కొంపూర్ మున్సిపల్ డివిజన్ల నివాసితులు – ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని నీటి సమస్యపై తమ గొంతును వినిపించాలని బీ.ఆర్.ఎస్ పార్టీ స్థానిక నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ "వాక్ ఫర్ వాటర్" పోస్టర్ విడుదల కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ మణికొండ మరియు నెక్నంపూర్ డివిజన్ల సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన నాయకులు మరియు పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# బాటసారులపై వీధి కుక్కల దాడి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 09 2026 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలో వీధి కుక్కలు ప్రతిరోజు బాటసారులను గాయపరుస్తూ చిన్న పెద్ద తేడా లేకుండా ఇష్టానుసారంగా గాయపరుస్తున్నాయి సంబంధిత గ్రామపంచాయతీకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన కుక్కలపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోవడంతో వీధి కుక్కలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి మరోపక్క కుక్కల వలె కోతులు కూడా ప్రయాణికులపై దాడి చేసి వాటి ఇష్టానుసారంగా కరుస్తున్నాయి ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకొని వీధి కుక్కలను కోతులను పట్టుకొని మైదాన ప్రాంతాలకు వదిలి వేయవలసిందిగా అధికారులను కోరుతున్నారు

## లైంగిక వేధింపులు

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

బాపట్ల బాపట్ల జిల్లా నిజాంపట్నానికి చెందిన ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని, అధికార పార్టీ జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం సంచలనం సృష్టిస్తోంది. తనను గెస్ట్ హౌస్కు రావాలని ఒత్తిడి చేశారని, లొంగకపోతే ఉద్యోగం తీయిస్తానని బెదిరించారని బాధితురాలు శివకుమారి ఆసుపత్రి నుంచి విడుదల చేసిన వీడియోలో ఆరోపించారు. సుబ్బయ్య వల్ల తన ప్రాణాలకు హాని ఉందని, ఇలాంటి వారు రాజకీయాల్లో ఉండటం మహిళా లోకానికే అవమానమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సుబ్బయ్యపై క్రిమినల్ కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు పోరాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు

# స్మార్ట్ సిటీగా మారనున్న జహీరాబాద్

## ఈనెల 10 న ప్రధాని శంకుస్థాపన

## అభివృద్ధి దిశగా అడుగులు

సదాశివపేట్, పటాన్ చెరు ప్రాంతా లతో పాటు కర్ణాటకలోని

105 ఇంటిగ్రేటెడ్ .ఔండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి ప్రధాని శంకుస్థాపన

**జహీరాబాద్ మే 9 ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైనజహీరాబాద్ త్వరలోనే ప్రపంచ స్థాయి ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీగా రూపాంతరం చెందనుంది. ఈ నెల 10న సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలో 3,245 ఎకరా ల్లో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ గా హైద రాబాద్ లో శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుతో జహీరాబాద్ పేరు దేశవ్యాప్తంగా మరింత ప్రాచుర్యం పొందనుంది. కేంద్ర ప్రభుత్వం 2024లో దేశ వ్యాప్తంగా స్మార్ట్ సిటీల అభివృద్ధి దిశగా 12 గ్రీన్ ఫీల్డ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను ప్రకటించగా, వాటిలో తెలంగాణకు ఒకటి కేటాయించింది. ఈ ప్రాజెక్టును జహీ రాబాద్ కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు.



17 గ్రామాల్లో 12, 650 ఎకరాలు..




నిమ్ కోసం ఝరాసంగం, న్యాల్ కల్ మండలాల పరిధి లోని 17గ్రామాల్లో సుమారుగా 12,650 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఇప్పటికీ పదివేల ఎకరాలకు పైగా రైతుల నుంచి సేకరిం చారు. ఇందులో భాగంగా మొదటి విడత అభివృద్ధి కోసం ఝరాసంగం మండలంలోని బర్దిపూర్, ఎల్గోయ్, చిలేపల్లి, చిలేపల్లి తాండా, రుక్మాపూర్ గ్రామాల్లో సేకరిం చిన 3.245 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ ప్రాజెక్టును హైదరాబాద్–నాగ్ పూర్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్నారు. దీనికి సంబంధించి రూ.2,369 కోట్లతో లేఅవుట్ అభివృద్ధి. రహదారుల నిర్మాణం, విద్యుత్ సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సదుపాయం, పార్కులు, ఇంటర్నెట్ తదితర మౌలిక వసతుల కోసం టెండర్లు పిలిచారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు ఇప్పటికే పనులు ప్రారంభించా యి.

ప్రాజెక్టును మొత్తం రూ.2,360.54 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ ప్రాజెక్టు ద్వారా రూ. 10,000 కోట్లకు పైగా పెట్టుబ డులు ఆకర్షించడంతో పాటు సుమారు 1.74 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ స్మార్ట్ సిటీలో లాజిస్టిక్స్, ఆటో భాగాలు, ఎలక్ట్రానిక్స్, మెషినరీ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలకు అనుకూలంగా ప్రత్యేక పారిశ్రామిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయను న్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం పారిశ్రా మిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశా లకు కేంద్రంగా మారుతుందని అధికా రులు భావిస్తున్నారు.

నిమ్జ్ ప్రాంతానికి సమీపంగా ఉన్న సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పెట్టుబ డిదారులతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా ఈ ప్రాంతంలో పెట్టుబ డులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. జహీరాబాద్, నారాయ ణఖేడ్,

నిమ్జ్ ప్రాంతం

3,245 ఎకరాల్లో స్మార్ట్ సిటీ విస్తరణ

రూ. 2,369 కోట్లతో పనులకు శ్రీకారం

రూ.10వేల కోట్లకు పైగా పెట్టుబడుల ఆకర్షణకు అవకాశం

1.74 లక్షల ఉద్యోగ అవకాశాల సృష్టి

మన్నెకెల్లి, బీదర్, చించోలి తదితర ప్రాంతాలను నిమ్స్ కు సరిహద్దు ప్రాంతాలుగా పేర్కొంటూ పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ల ప్రారం భిస్తున్నారు. ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెడితే భవిష్య త్తులో మంచి లాభాలు పొందే అవకాశం ఉందని విశ్లేష కులు అభిప్రాయపడుతున్నారు.

నిమ్జ్ పరిధిలో ప్రధాన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. జాతీయ రహదారి నెం. 65 నుంచి నిమ్ వరకు 9 కిలోమీటర్ల మేర రూ.100 కోట్లతో ప్రత్యేక రోడ్డు నిర్మించారు. అలాగే అనుసంధానంగా 60 మీటర్ల వెడల్పుతో 8.95 కిలోమీటర్ల రహదారి నిర్మించనున్నారు. మరోవైపు 45 మీటర్ల వెడల్పుతో 11.68 కిలోమీటర్లు, 30 మీటర్ల వెడల్పుతో మరికొన్ని రహదారుల నిర్మాణం కూడా చేపట్టనున్నారు. నిమ్ పరిధిలో 10 మీటర్ల వెడల్పుతో 10 కిలోమీటర్లు, 24 మీటర్ల వెడల్పుతో 16 కిలోమీటర్లు కలిపి మొత్తం 47.82 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే సుమారు 47 కిలోమీటర్ల అంతర్గత రోడ్డు నెట్ వర్క్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం తొలి దశలో 433 ఎకరాలు కేటాయించి టెండర్ ప్రక్రియను పూర్తి చేశారు. నిమ్జ్ లో డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ కేంద్రాలు, ప్రాథమిక పారిశుద్ధ్య భవనాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టనున్నారు. పరిశ్రమల కోసం 1,939.40 ఎకరాలు కేటాయించగా, లాజిస్టిక్స్, నివాసాలు, వ్యాపార అవసరాల కోసం ప్రత్యేక స్థలం కేటాయించనున్నారు.

# కోతుల నుండి మమ్మల్ని కాపాడండి

## గ్రామపంచాయతీ కి విజ్ఞప్తి చేస్తున్న గ్రామస్తులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 09 2026 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలో రోజు రోజుకి పెరిగిపోతున్న కోతులు ఉదయం ఐదు నుంచి కోతుల బెడద తట్టుకోలేని పరిస్థితిలో ఊరి గ్రామస్తులు ఏటూరు నాగారం చుట్టూ చెట్లు ఎక్కువగా ఉండడంతో అడవిలో నుంచి ఊరిలోకి చేరి ఇండ్లలో ఉన్న పప్పు అన్నం చెట్లకు కాసిన కాయలు కిరణం షాపులు పండ్ల దుకాణాలు కూరగాయల తోటలు పంట పొలాలపై ముక్కుమ్మడిగా దాడి చేసి పంట పొలాల నాశనం చేస్తూ కూరగాయల తోటలు ఇండ్లలో చేరి ఇండ్లలో ఉన్న కుటుంబ సభ్యులపై దాడి చేసి ఇంట్లో ఉన్న ఆహార పదార్థాలను తీసుకొని వెళ్లి చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి

కోతుల బెడద తట్టుకోలేక పలుమాలు గ్రామపంచాయతీ ఫిర్యాదు చేసిన పట్టించకపోవడంతో కోతులు విచ్చలవిడిగా సంచరిస్తూ బాటసారులను గాయపరుస్తున్నాయి ప్రభుత్వ అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని కోతుల బెడద నుంచి విముక్తి ప్రసాదించాలని గ్రామస్తులు కోరుకున్నారు

## శ్రీశైలంలో సైబర్ మోసం

శ్రీశైల మహా క్షేత్రంలో సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. నకిలీ వెబ్సైట్లతో సైబర్ మోసగాళ్లు. భక్తుల నిలువుగా దోచుకుంటున్నారు. తాజాగా ఢిల్లీకి చెందిన ఆనంద్ కుమార్ మల్లికార్జున్ సదన్ లో ఏసీ గదులను ఓ వెబ్సైట్ ద్వారా బుక్ చేసుకున్నారు ఇందుకోసం పేటియం ద్వారా 15 వేల రూపాయలు చెల్లించారు. సంబంధిత యాత్రికులు గదుల కోసం సంప్రదించగా అక్కడ గదులు బుకింగ్ జరగలేదని తెలిసింది. దీంతో బాధితులు మోసపోయారు గుర్తించారు

# శిథిలమైన పుష్కర ఘాట్ గోదావరి వరద తాకిడికి కోతకు గురైన పుష్కర ఘాట్లు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 09 2026 ఏటూరు నాగారం** ములుగు జిల్లాలోని ఏటూరు నాగారం మండల కేంద్రంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ శిథిల వ్యవస్థకు చేరుకుంది గోదావరి వరద తీవ్రత కారణంగా పుష్కర ఘాటు విరిగిపోయి గోదావరిలో కలిసిపోయింది 2027 లో జరగనున్న గోదావరి పుష్కరాలకు ముందస్తుగా తెలంగాణ ప్రభుత్వం పుష్కర మహోత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాటు చేస్తుండగా ఒక వైపు ములుగు జిల్లాలో మంగపేట ముల్లకట్ట రామన్నగూడెం గ్రామాలలో పుష్కర ఘాట్లను కోటి రూపాయలు పైగా ఖర్చు చేసి నిర్మించారు 2013 14 సంవత్సరంలో నిర్వహించిన పుష్కరాలు ఇప్పటికి మళ్ళీ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నారు ములుగు జిల్లాలో ఉన్న గోదావరి పుష్కరాలకు అనేక ప్రాంతాల నుంచి హైదరాబాద్ వరంగల్ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు గోదావరి పుష్కరాలలో స్నానాలు ఆచరించడానికి చాలామంది భక్తులు రామన్నగూడెం మంగపేట వెళ్లి అక్కడ స్నానాలు ఆచరిస్తారు పవిత్ర స్థానాలు ఆచరించడానికి ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారిన పుష్కర ఘాట్లు మంగపేట పుష్కర ఘాట్ గోదావరి ప్రవాహానికి కొట్టుకపోయి పుష్కర ఘాట్లు ఆనవాలు లేకుండా పోయింది అలాగే ఏటూరునాగారం రామన్నగూడెం వద్ద నిర్మించిన పుష్కర ఘాటు ప్రతి సంవత్సరం గోదావరి వరదకు కొట్టుకొని పోయి ప్రస్తుతానికి పుష్కర ఘాట్లో స్నానాలు ఆచరించే పరిస్థితి కనబడడం లేదు అలాగే ముల్లకట్ట బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన పుష్కర ఘాటుకు 2013 14 సంవత్సరంలో నీరు అందకపోవడంతో పుష్కర స్నానాలను అప్పటి కలెక్టర్ నిలిపివేశారు ప్రస్తుతానికి ముల్ల కట్ట వద్ద పుష్కర ఘాటుకు ఇసుక తప్ప నీరు అందలేని పరిస్థితి మరి ఇప్పటి ప్రభుత్వం ఈ పుష్కర ఘాట్లను కొత్తగా నిర్మిస్తారా లేక వాటిని పునరుద్ధరణ చేసి పుష్కర ఘాటు వద్ద పుష్కర స్నానాలు చేసే విధంగా తీర్చిదిద్దుతార అనే కోణంలో ఆలోచిస్తున్నారు



# రుచుల నగరంలో కల్తీ విషం: మీ ప్లేట్‌లో ఉన్నది ఆహారమా.. అనారోగ్యమా..?



Dr.Konderu Rakesh
Political analyst

**మే 09 హైదరాబాద్ 2026 (ప్రజాబలం ప్రతినిధి)** భాగ్యనగరం అంటేనే ఘుమఘుమలాడే బిర్యానీలు, నోరూరించే ఇరానీ చాయ్, లెక్కలేనన్ని స్ట్రీట్ ఫుడ్ వెరైటీలు. కానీ, ఇప్పుడు ఆ రుచుల వెనుక ఒక భయంకరమైన చీకటి కోణం దాగి ఉంది. 'కలి కాలం' కాస్తా 'కల్తీ కాలం'గా మారుతోంది. హోటళ్లు, బేకరీలు, తయారీ కేంద్రాలపై ఇటీవల జరుగుతున్న దాడులు చూస్తుంటే, మనం తినే ఆహారం అమృతమో లేక విషమో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

గత కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో టాస్క్ ఫోర్స్ అధికారులు నిర్వహిస్తున్న తనిఖీలు సంచలనం సృష్టిస్తున్నాయి. కాటేదాన్ వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో కుళ్ళిపోయిన గుడ్లు, నాణ్యత లేని మైదాతో కేకులు, బిస్కెట్లు తయారు చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ముషీరాబాద్ పరిసరాల్లోని అనధికార యూనిట్లలో గడువు తీరిన ఫ్లేవర్లు, హానికరమైన సింథటిక్ రంగులను ఐస్‌క్రీమ్‌లలో వాడుతున్నారు. ఇవి నేరుగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. వంటింట్లో నిత్యం వాడే అల్లం-వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపులో సైతం రసాయనాలు, రంగులు కలుపుతూ సామాన్యుడి ప్రాణాలతో వ్యాపారులు చెలగాటమాడుతున్నారు. మౌన యుద్ధం.. ముంచుకొస్తున్న ముప్పు: కల్తీ ఆహారం అనేది ఒక నిశ్శబ్ద హంతకి (ాఅశ్రీవత్ ఖఅశ్రీశ్రీవతీ) లాంటిది. ఇది తిన్న వెంటనే ప్రభావం చూపకపోవచ్చు, కానీ క్రమంగా శరీర అవయవాలను నిర్వీర్యం చేస్తుంది. గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి మొదలై కాలేయం (ాఅజవతీ), కిడ్నీలు పాడవ్వడం వరకు దారితీస్తుంది. చిన్న పిల్లల్లో ఎదుగుదల లోపించడం, రోగ నిరోధక శక్తి క్షీణించడం ఆందోళన కలిగిస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందాలనే దురాశే ఈ కల్తీ మాఫియాకు మూలం. నగర శివార్లలోని గల్లీల్లో లైసెన్స్ లేకుండా వెలుస్తున్న చిన్న చిన్న యూనిట్లు పర్యవేక్షణకు అందకుండా పోతున్నాయి. శుభ్రత లేని వాతావరణం, నిల్వ ఉంచిన పదార్థాల వాడకం ఇక్కడ సర్వసాధారణం అయిపోయాయి. ప్రభుత్వ యంత్రాంగం దాడులు చేస్తున్నప్పటికీ, వినియోగదారులుగా మనవంతు బాధ్యత అవసరం. ఏదైనా ప్యాక్ చేసిన వస్తువు కొనే ముందు ఖీూూా× మార్క్ మరియు ఎక్స్‌పైరీ డేట్‌ను తప్పనిసరిగా చూడాలి. మార్కెట్ ధర కంటే మరీ తక్కువ ధరకే వస్తువు వస్తుందంటే దాని నాణ్యతపై అనుమానించాల్సిందే. ఎక్కడైనా అపరిశుభ్రత లేదా కల్తీ జరుగుతోందని తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదుగుతున్న తరుణంలో, ఇలాంటి కల్తీలు నగరం యొక్క ప్రతిష్టను దిగజార్చుతున్నాయి. ఇది కేవలం చట్టపరమైన సమస్య మాత్రమే కాదు, సామాజిక బాధ్యత కూడా. అధికారులు కఠిన చట్టాలను అమలు చేయాలి, వ్యాపారులు నైతికతను పాటించాలి. అప్పుడే మన నగరం 'రుచుల రాజధాని'గా సురక్షితంగా ఉంటుంది.

డాక్టర్ కొండేరు రాకేష్
రాజకీయ విశ్లేషకులు

# ప్రధాని సభకు బందోబస్తు కోసం ఏర్పాట్లు పూర్తి

సికింద్రాబాద్ ఆదివారం జరిగే ప్రధాని నరేంద్ర మోడీ సభ బందోబస్తు కోసం ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ట్రాఫిక్ మళ్లింపుల దృష్ట్యా ప్రజలకు ముందస్తు సూచనలు చేస్తున్నాము..జాగ్రత్తలు పాటించాలి. లక్ష మంది వస్తారని అంచనా వేస్తున్నాం..సభకు వచ్చే ప్రజలకు తగ్గట్టు ఏర్పాట్లు చేశామని మల్కాజ్ గిరి సీపీ సుమతి అన్నారు.

శాంతి భద్రతలు,ట్రాఫిక్,టాస్క్ ఫోర్స్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సభను ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం. 2 వేల మంది పోలీసులు,620 మంది ట్రాఫిక్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. డీసీపీ స్థాయిలో 3,అదనపు డీసీపీ లు, ఎసిపి లు,ఇన్స్పెక్టర్లు,సబ్ ఇన్స్పెక్టర్ లు బందోబస్తులో ఉంటారు. సభకు 2620 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చేశాం. 4 గంటల ముందే పరేడ్ మైదానం పరిసర ప్రాంతాలను పోలీసుల అదుపులోకి తీసుకుంటామని అన్నారు.

పరేడ్ మైదానం పరిసర ప్రాంతాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. ఎంట్రీ గేట్ లో నాన్ పర్మిటెడ్ వస్తువులకు అనుమతి లేదు. డ్రోన్లు నిషేధిత ప్రాంతంగా ప్రకటించాం. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుంది. డ్రోన్లు ఎగురవేయడం నిషిద్ధం..బోయినపల్లి,మారేడుపల్లి,బేగంపేట పరిసరాల్లో ప్రత్యేక భద్రత వ్యవస్థ ఉంటుంది. ట్రాఫిక్ మళ్లింపులకు సంబంధించి డీసీపీ లు,ఎసిపి లు పర్యవేక్షిస్తారు. 8 చోట్ల పార్కింగ్ వసతి ఏర్పాటు చేశాము.. బైసన్ పోలో,బోయిన్ పల్లి మార్కెట్ యార్డ్ ఇతర ప్రాంతాలలో ఉత్తర తెలంగాణ వాళ్లకు పార్కింగ్ కు అనుమతి ఉంది. 3000 బస్సులకు,కార్లకు పార్కింగ్ సౌకర్యం కల్పించాం. 700 బస్సులకు పార్కింగ్ వసతి కల్పించాము. పఠాన్ చేరు,చాంద్రాయణ గుట్ట నుండి వచ్చే వాళ్లకు పబ్లిక్ గార్డెన్, ఎల్బీ స్టేడియం ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశాం. సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి..వేసవి దృష్ట్యా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ఆమె అన్నారు.




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** శనివారంనాడు వి. హనుమంత్ రావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుమరియు ధనలక్ష్మి ఓబీసీ కన్వీనర్ జనగననలో కులగనన ఓబీసీ కాలం చేర్చాలని చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష కు సంఘీభవం తెలిపిన బద్దం సతీష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ ప్రధాన కార్యదర్శి, శివకుమార్ ప్రెసిడెంట్ సేవాదళ్ బేగంబజార్, రజినీకాంత్ వైస్ ప్రెసిడెంట్ సేవాదళ్, చేతన్ ఆనంద్, శ్రీనివాస్,

# నిమ్జ్ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**మౌలిక సదుపాయాలు, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు మరియు కాంట్రాక్టర్ కి ఆదేశాలు.**
**నిమ్జ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష**

**జహీరాబాద్, మే 09 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (నిమ్జ్ ) పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, ఎక్విప్మెంట్‌ను పెంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ వర్క్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.



మౌలిక వసతుల ఏర్పాట్లలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

శనివారం కలెక్టర్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వీరారెడ్డి తో కలిసి జహీరాబాద్ రెవెన్య డివిజనల్ అధికారి కార్యాలయంలో నిమ్జ్, పరిధిలోని భూముల అభివృద్ధి, సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, స్వాధీనం చేసుకున్న భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు తదితర అంశాలపై టీజీఐఐసీ, నిమ్జ్, రెవెన్యూ మరియు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



అంతకుముందు నిమ్జ్ భూముల మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు సేకరించిన భూములు, ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. సేకరించిన భూమిలో చుట్టు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేయాలని సూచించారు.



ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీరారెడ్డి, జోనల్ మేనేజర్ విఠల్, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, రెవెన్యూ డివిజనల్ అధికారి దేవూజ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీస్ శాఖ అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హనుమాన్ స్వాములకు అన్న ప్రసాదం ఏర్పాటు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 07 2026. ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని రామాలయం టెంపుల్ లో హనుమాన్ దీక్ష స్వాములకు దీక్ష సమయం దగ్గర పడుతున్న తరుణంలో శనివారం దీక్ష తీసుకున్న స్వాములకు పర్వతాల లాలయ్య అయ్యప్ప గురు స్వామి కుటుంబ సభ్యులు 100 మంది స్వాములకు మహా అన్నప్రసాదాన్ని అందజేశారు

దీనితో రామాలయం అంత శ్రీరామనామంతో మార్మోగిపోయింది అన్న ప్రసాదాన్ని అందజేసిన కుటుంబ సభ్యులను హనుమాన్ దీక్ష స్వాములు ఆశీర్వాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో పర్వతాల ప్రవీణ్ దంపతులు పాల్గొన్నారు

# సీతక్క చొరవతో గుర్రాల బావిలో సోలార్ పంప్ సెట్ ప్రారంభించిన స్థానిక సీఐ

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 07 2026 ఏటూరు నాగారం** గుర్రాల బావి గుత్తి కోయ గ్రామంలో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిని పరిష్కరించాలని గ్రామస్థులు ఎన్నాళ్ళుగానో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర మంత్రి సీతక్క తక్షణమే స్పందించి గ్రామంలో కొత్త సోలార్ పంప్ సెట్ బోర్ వేయించారు.

బిఏటూరునాగారం మండలం, గుర్రాల బావిలో కొబ్బరికాయ కొట్టి సోలార్ విద్యుత్ బోరు ప్రారంభించిన సీఐ శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్ స్థానిక నాయకులు, గ్రామస్థులు విన్నపం మేరకు తక్షణమే అభివృద్ధికి మంత్రి సీతక్క ఆదేశాలతో అధికారులు యుద్ధప్రాతిపదికన బోర్ వేయగా నీరు పడటంతో గ్రామస్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు

బిగ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడమే తమ లక్ష్యమని గ్రామస్థుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు

ఎన్నో ఏళ్లుగా నీటి,విద్య సమస్యకు బాధపడుతున్న



గ్రామస్తులకు ఇటీవల కంటైనర్ స్కూల్ ఏర్పాటు చేయడం జరిగింది.ఇప్పుడు సోలార్ పంప్ సెట్ బోరు ఏర్పాటు చేయడమైందన్నారు.

మంత్రి సీతక్క కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు ఈ సందర్భంగా గ్రామస్తులు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచులు దేవులపల్లి విజయ్ కుమార్, పలక చిన్నన్న, అట్టం రాంబాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు, సోదారి హరీష్ తదితరులు పాల్గొన్నారు

# స్వీయ జనగణనలో ఒక్క రోజే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 07 2026 ములుగు**2027 జనగణనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. https://se.census.gov.in? అనే వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి సులభంగా నమోదు చేయవచ్చని, నచ్చిన భాషను ఎన్నుకొని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన స్వీయ గణన ఆన్లైన్ నమోదు కార్యక్రమం

ఈ నెల 10వ తేదీతో ముగుస్తుందని స్పష్టంచేశారు. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు.

దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమని కలెక్టర్ తెలిపారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు కూడా తమ ప్రస్తుత నివాసం నుండే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

జనగణన సందర్భంగా అందరూ తమ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని కోరారు. ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతాయని స్పష్టం చేశారు. ఆన్లైన్ నమోదు తదుపరి ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని, అట్టి నంబర్ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని తెలిపారు. ఒక్క రోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని ఆయన సూచించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చెయ్యాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.



**ములుగు జిల్లా ప్రజా బలం ప్రతినిధి మే 09 2026 ములుగు** ధాన్యం కొనుగోలు, ఫార్మర్ రిజిస్ట్రీ, సెన్సస్, విద్యా వారోత్సవాలపై శనివారం హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ అన్ని జిల్లాలలో వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు ఒక్క రోజే మిగిలి ఉండడంతో ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో పది లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని, వీరంతా స్వీయ గణన చేసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సిఎస్ సూచించారు.



ములుగు జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు వీసీ లో పాల్గొన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

విద్యా వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సి పి ఓ ప్రకాష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సయ్యద్ షా ఫైసల్ హుస్సైని, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల కార్పోరేషన్ ఎస్ కృష్ణవేణి, డి ఏ ఓ సురేష్ కుమార్, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలలో నెలల తరబడి రైతుల పడిగాపులు.

వనపర్తి .జిల్లాలో సివిల్ సప్ లై అధికారులు పూర్తిగా విఫలం. క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించాలి.బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తున్నా రైతుల గోస అ ధికారులకు పట్టదా అని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం రోజున బిసి నాయకుల సమావేశంలో మండిపడ్డారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎటు చూసినా రోడ్డుపైన మొక్కలు, వడ్లు అరబోసి ఉండడంతో వ్యవసాయ మార్కెట్ కి వెళ్లి కొనుగోలు కేంద్రాలలో అక్కడ పరిశీలించగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న దన్నోజు అరవింద్ చారి ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ వడ్లు, మొక్కజొన్నలు సకాలంలో కొనుగోలు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారన్నారు. నెలల తరబడి కొనుగోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం మౌలిక వసతులు కూడా లేని పరిస్థితుల్లో మార్కెట్ యార్డుల్లో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు తరబడి ధాన్యం దగ్గర పడిగాపులు కాసే విధంగా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. చలికి, ఎండకు, వానకు సంబంధం లేకుండా ప్రతి నెల క్రమం తప్పకుండా ప్రభుత్వం అధికారులకు వేతనాలు చెల్లిస్తుంటే, రైతులు మాత్రం ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా నెలల తరబడి నిరీక్షించాల అని ప్రశ్నించారు. కేవలం పైపై సమీక్షలు చేస్తే సరిపోదని, అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిలదీశారు. జిల్లాలో సివిల్ సప్లై వ్యవస్థ సక్రమంగా పని చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని, అలా జరగనప్పుడు దళారులు రైతులను నిలువున ముంచి తక్కువ ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు కలుగుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, తక్షణమే ధాన్యం కాంటాలు చేసి ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేయాలని లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి హెచ్చరించారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా బిసి పొలిటికల్ జేఏసీ నాయకులు యశ్వంత్ గౌడ్, శివ, శేఖర్, రాజు, మహేందర్ నాయుడు, అంజి యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ హాస్టళ్లు బేష్

**ఐవీఆర్ఎస్ సర్వేలో టాప్ ప్లేస్**

**సంక్షేమ హాస్టళ్లలో 78.20 శాతంతో అగ్ర స్థానంలో బీసీ హాస్టళ్లు**

**విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణలో వెల్లడి**

**కూటమి ప్రభుత్వం రాకతో బీసీ బిడ్డల చదువుకు ప్రాధాన్యం**

**అధికారంలోకి రాగానే గత ప్రభుత్వపు రూ.110 కోట్ల డైట్ బకాయిల చెల్లింపు**

అమరావతి : కూటమి ప్రభుత్వం రాకతో బీసీ బిడ్డల విద్యకు ఆసరాగా నిలిచే హాస్టళ్లు మెరుగైన పనితీరుతో ముందంజలో నిలుస్తున్నాయి. మౌలిక సదుపాయల కల్పన, ఆరోగ్యకరమైన మెనూ, బోధనలతో రాష్ట్ర స్థాయిలో బీసీ హాస్టళ్లు అగ్రగామిగా నిలిచాయి. పరిశుభ్రమైన వాతావరణం, పరిశుద్ధమైన తాగునీటి కల్పన, ఆరోగ్యభద్రతతో కూడిన విద్యను అందించడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల మనస్సును బీసీ హాస్టళ్లు గెలుచుకున్నాయి. హాస్టళ్ల నిర్వహణపై ప్రభుత్వ ఐవీఆర్ సర్వేలో మిగిలిన సంక్షేమ హాస్టళ్లకంటే బీసీ సంక్షేమ హాస్టళ్లు 78.02 శాతం సంతృప్త స్థాయిలతో ప్రథమ స్థానంలో నిలిచి ఔరా అనిపించుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 1110 బీసీ బాలురు, బాలికల హాస్టళ్లు ఉన్నాయి. గత ప్రభుత్వంలో బీసీ సంక్షేమ హాస్టళు పూర్తిగా నిరాదరణకు గురయ్యాయి. నిధులు విడుదల చేయకపోవడంతో మరమ్మతులు సైతం నోచుకోలేకపోయాయి. కనీసం డైట్ బిల్లు కూడా చెల్లించకపోవడంతో బీసీ బిడ్డలు అర్ధాకలితో నరకం చూశారు. కాస్మోటిక్ ఛార్జీలు సైతం చెల్లించిన పాపానపోలేదు. దినదిన గండంగా ఆ అయిదేళ్లు బీసీ హాస్టళ్లలో చదివే విద్యార్థులు కాలం నెట్టుకొచ్చారు. కూటమి ప్రభుత్వం రాకతో ఇతర సంక్షేమ హాస్టళ్లతో పాటు బీసీ సంక్షేమ హాస్టళ్లకు మంచిరోజులు ప్రారంభమయ్యాయి. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా బీసీ బిడ్డల ఆకలి తీర్చేలా రూ.110 కోట్ల మేర డైట్ బకాయిలను చెల్లించారు. నాటి నుంచి ఎప్పటికప్పుడు డైట్ బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. కాస్మోటిక్ ఛార్జీలను సైతం విద్యార్థులకు సకాలంలో చెల్లిస్తున్నారు. 23 నెలల కాలంలో బీసీ హాస్టళ్ల మరమ్మతులు, ఇతర నిర్మాణాల కోసం రూ.100 కోట్లు వెచ్చించారు. రూ.2 కోట్లతో 104 హాస్టళ్లలో విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ అందజేయడానికి ఎస్.ఆర్. శంకరన్ రిసోర్స్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో బీసీ బిడ్డలు 85.99 శాతం ఉత్తీర్ణత సాధించారు.






Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com